పెన్ పవర్
తెలంగాణ రౌండప్

## పేదల సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:** పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. "రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలి." అని పొంగులేటి తెలిపారు.


# మల్లన్నకు 'రక్తా'క్షరాల లేఖాస్త్రం..!


- ఓ అభిమాని ఆవేదన..! మాజీ మంత్రికి రక్తంతో లేఖ..!
- ఈ ఆకాశ రామన్న ఉత్తరం..! ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్..!


- మల్లారెడ్డి గారూ..! మా రక్తంతో మోసిన బీఆర్ఎస్ జెండాను మరువకండి..!
- కష్టకాలంలో పార్టీకి దూరమెందుకు..? కేసీఆర్‌పై విమర్శలకు మీ స్పందన ఏది..?
- ప్రత్యర్థుల వేదికలపై కనిపించడంపై ఆగ్రహంతోనే లేఖాస్త్రం..!
- కార్యకర్తల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు..! 'బీఆర్ఎస్' తెలంగాణ ఆత్మగౌరవం..!
- మల్లన్నా..! కార్యకర్తలను మరచిన నాయకుడికి చరిత్రలో స్థానం లేదు..!


మాజి మంత్రి మల్లారెడ్డి అయోమయంలో పడ్డారా..? కుటుంబంతో బీజేపీ పెద్దలను కలవడం..! కాంగ్రెస్ పార్టీ ప్రముఖులతో టచ్‌లో ఉన్నారని సర్వత్రా ఆరోపణలు ఎదుర్కొంటున్నది చూస్తున్నం.. మరోవైపు కాంగ్రెస్‌పార్టీ వేదికలపై కనిపించడం..! కేసీఆర్ కుటుంబీకులను విమర్శించినా.! స్పందించక పోవడం..! లాంటి విషయాలను ఓ అభిమాని ఆవేదనతో రాసిన 'రక్తా'క్షరాల లేఖాస్త్రంతో.. సోషల్ మీడియా ద్వారా మల్లారెడ్డికి సూటిగా ప్రశ్నలు లేవనెత్తుతోంది.. కొందరు ప్రశ్నించినా దాటవేసే ధోరణితో వ్యవహరించడం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 22:**










మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డికి ఓ బీఆర్ఎస్ కార్యకర్త ఆవేదనతో, రక్తంతో రాసిన, ఈ ఆకాశరామన్న ఉత్తరం.. సోషల్ మీడియాలో సంచలనం రేపుతోంది..! పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలవాలని.. ఆవేదనతో సూచించాడా అభిమాని.. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఓ అభిమాని, కార్యకర్త రక్తంతో లేఖ రాయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ప్రత్యర్థుల వేదికలపై కనిపిస్తున్నారంటూ ఆ కార్యకర్త తన లేఖలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.. తన కోసం బీఆర్ఎస్ జెండాను భుజాన మోసిన లక్షలాది మంది కార్యకర్తల విశ్వాసాన్ని దెబ్బతీయవద్దని లేఖలో విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఉత్సాహంగా ముందుండి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న మల్లారెడ్డి.. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎందుకు దూరంగా ఉంటున్నారని ప్రశ్నించారు.. కార్యకర్తలను కేవలం తన విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగులుగా చూడకుండా, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలుగా గౌరవించాలని ఆవేదన వ్యక్తం చేశారు.. డబ్బు, అహంకార ధోరణులతో పార్టీని బలహీనపరిచే విధంగా వ్యవహరించవద్దని మండిపడ్డారు.. బీఆర్ఎస్ పార్టీ అంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అలాంటి పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కి అవమానించడం బాధాకరమని కార్యకర్త పేర్కొన్నారు..

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను మరచిపోయే ఏ నాయకుడైనా చరిత్రలో కనుమరుగవడం తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు.. అందుకే నా ఆవేదనను రక్తంతో లేఖగా రాస్తున్నాను అంటూ ఆ కార్యకర్త తన భావోద్వేగాన్ని లేఖలో వ్యక్తపరిచాడు.. ఈ రక్తంతో రాసిన లేఖ ప్రస్తుతం మేడ్చల్ రాజకీయ వర్గాల్లో, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 'సీసీఐ' పునరుద్ధరణపై ప్రభుత్వ వైఖరేంటి?

### ముఖ్యమంత్రికి కేటీఆర్ లేఖ



పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారం పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానమేంటో స్పష్టం చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం కేటీఆర్ లేఖ రాశారు. "సీసీఐ పునరుద్ధరణ అనేది కేవలం ఒక పరిశ్రమకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇది వేల కుటుంబాల జీవనాధారం. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తు, తెలంగాణ

-4 లో

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ డ్రామాలే



**హైదరాబాద్ పెన్ పవర్:** నీట్ వివాదం, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆందోళన డ్రామాలకు తెరదీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం అది బీజేపీకే లాభమని, ఆయన తమ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. ప్రధాని నివాసం వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని, నీట్ అంశంపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, రాహుల్ కాబోయే ప్రధాని అని రేవంత్ రెడ్డి అనడం పెద్ద జోక్ అని కొట్టిపారేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ కేవలం

-4 లో



గోదాములో 25 టన్నుల నిషేధిత ఆశీర్వాద్ ఆటా అండ్ గోదుమ పిండి..



షాపూర్ నగర్ కమల్ సేల్స్ గోదాములో జిఎస్‌టి-ఎస్‌ఓటి అధికారులు..

# తెలంగాణలో నిషేధిత 'ఆశీర్వాద్ ఆటా'... విక్రయాలపై దాడులు




తెలంగాణ తోపాటు మరో 5 రాష్ట్రాల్లో నిషేధించినట్లు ప్యాకెట్‌ల మీద స్పష్టంగా..




## జిఎస్‌టి-ఎస్‌ఓటి పోలీసుల జాయింట్ ఆపరేషన్..

**జీడిమెట్ల, పెన్ పవర్, జూలై 22:** తెలంగాణలో నిషేధించిన 'ఆశీర్వాద్ ఆటా' 'గోదుమ పిండి'ని అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్ మార్కెట్‌లో "జీఎస్‌టి అధికారులు-కుత్బుల్లాపూర్ ఎస్‌ఓటి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు.. రహస్య సమాచారం మేరకు షాపూర్‌నగర్ మార్కెట్‌లోని 'కమల్ సేల్స్ కార్పొరేషన్' గోదాముపై అధికారులు తనిఖీలు చేపట్టారు. తెలంగాణలో విక్రయించరాదని పేర్కొన్న 'చీూ ఖీూ= ూఝూజు Xచీ ఎజుూూచీ+ూచీూ' ముద్రతో ఉన్న 'ఆశీర్వాద్ ఆటా, గోధుమ పిండి' ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్లు సమాచారం.. జీఎస్‌టీ నిబంధనలను ఉల్లంఘిస్తూ పన్నులు ఎగవేస్తున్నారనే ఆరోపణలతో పాటు, తెలంగాణలో విక్రయించరాదని తెలిసినప్పటికీ..! అధిక లాభాల కోసం ఉత్పత్తులను విక్రయిస్తున్నారనే అనుమానంతో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.. ఈ దాడుల్లో సుమారు 25 టన్నుల గోధుమ పిండిని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.. జీఎస్‌టి అధికారుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.. స్వాధీనం చేసుకున్న సరుకుకు సంబంధించిన బిల్లులు, పన్ను చెల్లింపులు, విక్రయ అనుమతులు, ఉత్పత్తులపై ఉన్న లేబులింగ్ తదితర అంశాలపై అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది..

- షాపూర్ నగర్ 'కమల్ సేల్స్'లో 25 టన్నుల గోధుమ పిండి స్వాధీనం..
- విశ్వసనీయ సమాచారం మేరకు గోదాములపై దాడులు నిర్వహించారు..
- 'నాట్ ఫర్ సేల్ ఇన్ తెలంగాణ' అని ముద్రించిన 'ఆశీర్వాద్ ఆటా, గోధుమ పిండి..
- పన్నులు ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు..!
- దీంతోపాటు నిషేధిత విక్రయ ఉత్పత్తులను అధిక లాభాలకు విక్రయిస్తున్నారని..

# రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ డ్రామాలే

-3 పేజి తరువాయి
రాజకీయ నాటకాలేనని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంగా కూడా చూడటం లేదని, సీజేపీతో పోటీ పడేందుకే ఈ తరహా నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు, తెలంగాణలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే, ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలు మాని వెంటనే రైతులకు నీరందించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 'సీసీఐ' పునరుద్ధరణపై ప్రభుత్వ వైఖరేంటి?

-3 పేజి తరువాయి
అభివృద్ధికి సంబంధించి ఇది అత్యంత కీలకమైన అంశం. అందుకే ఈ సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించాలనే ఏకైక లక్ష్యంతో.. సీసీఐ సాధన సమితి ప్రతినిధులతో కలిసి భారాస నేతల బృందం దిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేసింది. కేంద్ర మంత్రితో చర్చల సందర్భంగా అత్యంత కీలకమైన అంశం వెలుగులోకి వచ్చింది. సీసీఐ పునరుద్ధరణకు కేవలం రూ.250 కోట్ల పెట్టుబడిని పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే ఇది సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ దిశగా ఎలాంటి ప్రతిపాదనలు అందకపోవడం వల్లే ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందన కోసం కేంద్ర ప్రభుత్వం ఎదురుచూస్తున్న పరిస్థితుల్లో.. దీనిపై ప్రభుత్వ వైఖరేమిటో స్పష్టం చేయాలి" అని కేటీఆర్ లేఖలో సీఎంను కోరారు.

**ఒక్క ఓటరూ.. జాబితా నుంచి తొలగిపోకూడదు..**

సర్ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో డూప్లికేట్ లేదా అనర్హ ఓటర్లు జాబితాలో ఉండకుండా చూడాలని సూచించారు. ఆగస్టు 3 వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో 'సర్' కార్యక్రమంలో నిమగ్నం కావాలని తెలిపారు. సర్ కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీతో హైదరాబాద్‌లోని నివాసంలో కేటీఆర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలోని కమిటీ కేటీఆర్‌కు వివరించింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# నన్ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, బీజేపీల కుట్ర

- కొడంగల్ లో ఎస్ఐఆర్ ఫారమ్ స్వయంగా నింపిన రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌కు ఓటేసిన వారి ఓట్లను తొలగించే ప్రక్రియలో బీఆర్ఎస్, బీజేపీ ఉన్నాయని విమర్శ
- కుట్రదారులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్, బీజేపీల తప్పులను ప్రశ్నిస్తున్నందుకే తనను రాజకీయంగా దెబ్బతీయడానికి ఆ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆయన, తన ఫారమ్‌ను స్వయంగా నింపి అధికారులకు అందజేశారు. బూత్ లెవల్ ఏజెంట్లతో మాట్లాడారు.



అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలు పైకి వేరువేరుగా కనిపించినా, ఆ పార్టీల లక్ష్యం మాత్రం ఒకటేనని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన వారి ఓట్లను తొలగిస్తూ కొడంగల్‌లో కుట్రలకు తెరలేపారని, ఆ కుట్రదారులకు స్థానిక ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

'ఓటు లేని మనిషి సజీవంగా ఉన్నా చనిపోయినవారితో సమానం' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అవకాశం కోల్పోతారని హెచ్చరించారు. కొడంగల్‌లో ఇప్పటికే 78 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, ప్రతి ఒక్కరూ ఈ ఫారమ్ నింపి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులతో కలిసి కొడంగల్ వీధుల్లో నిర్వహించిన ధర్నా ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

# గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన




**హైదరాబాద్ పెన్ పవర్:**స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు.

గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# కేంద్ర వైఖరికి నిరసనగా 'ఛలో లోక్ భవన్'...

## పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ శ్రేణులు, విద్యార్థి లోకానికి పిలుపు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఢిల్లీ జంతర్ మంతర్ లో విద్యార్థులపై లాఠీ ఛార్జీకి నిరసనగా శాంతి యుత మార్గంలో ప్రశ్నిస్తే ఆయనపై దాడి చేసి గాయపరిచి,నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో ఉన్న అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గారిని అక్రమంగా అరెస్టు చేయడం భయటపడ్డ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడానికి మరియు రాహుల్ గాంధీ గారి అరెస్ట్‌కు నిరసనగా టిపిసిసి ఆధ్వర్యంలో 'ఛలో లోక్ భవన్' పిలుపునిచ్చినట్లు మంత్రి తెలిపారు. "ప్రశ్నించే గొంతుకలను అరెస్టులతో ఆపలేరు. రాహుల్ గాంధీ గారి వెనుక దేశ ప్రజలందరూ ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావలసిన సమయం ఇది." అని అన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు,విద్యార్థి లోకం ఛలో లోక్ భవన్ నిరసన కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు హైదరాబాద్ వాసులు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి చెందారు. షేక్ అబ్దుల్ నవీద్, నజేయా సల్మా దంపతులు, వారి ముగ్గురు పిల్లలు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో నజేయా సల్మా (45), కుమార్తె నిహాయీన్ షేక్ (19), కుమారుడు ఉమర్ షేక్ (14) అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ అబ్దుల్, ఐదేళ్ల కుమార్తె ఖదీజా తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని సైదాబాద్ లోని వాణి నగర్ కు చెందిన షేక్ అబ్దుల్ నవీద్ అమెరికాలో ప్రముఖ ఫార్మా కంపెనీ మెర్క్ లో డైరెక్టర్ గా పని చేస్తున్నారు.

## కరీంనగర్ జిల్లాలో అర్ధరాత్రి దోపిడి

**కరీంనగర్: పెన్ పవర్:** భగత్నగర్లో భగత్సింగ్ విగ్రహం సమీపంలో స్థానికంగా నివాసం ఉంటున్న అజ్మత్ అలీ అనే వృద్ధుడి ఇంట్లోకి అర్ధరాత్రి 12 గంటల తర్వాత సుమారు ఎనిమిది మంది గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. దోపిడీకి పాల్పడ్డారు. అజ్మత్ అలీ ఇంటి బయట లైట్ ఆఫ్ చేసి లోపలికి వెళ్లి పడుకోవడానికి సిద్ధమవుతుండగా.. బయటే మాటు వేసి ఒక్కసారిగా ఆయనపై దాడి చేసి ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. అందరినీ బెదిరిస్తూ అజ్మత్ అలీతో పాటు కుటుంబ సభ్యులను కట్టేసి తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న నగదు, బంగారాన్ని దోచుకుని పరార్ అయ్యారు. ఈ ఘటనలో రూ.15 లక్షల నగదు, 60 తులాల బంగారాన్ని దుండగులు అపహరించినట్లు ఇంటి యజమాని అజ్మత్ అలీ తెలిపాడు. పోలీసులు సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకుని.. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# మళ్లీ నామినేటెడ్ లొల్లి

**నల్గొండ, జూలై 22 పెన్ పవర్:** తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా.. కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ వ్యవహారం మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. గద్దెనెక్కిన కొత్తలోనే పదవులు లభిస్తాయని ఆశపడ్డ క్షేత్రస్థాయి నాయకులకు.. ఈ కాలయాపన మింగుడుపడటం లేదు. తాజాగా మరో 37 కార్పొరేషన్ ఛైర్మన్ల పదవీకాలం ముగియడంతో గాంధీభవన్‌లో రాజకీయం మరింత వేడెక్కింది. పాతవారికి రెన్యువల్ ఇస్తారా లేక కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తారా అన్న ఉత్కంఠతో పాటు.. ఈ జాప్యానికి అసలు బాధ్యులెవరనే కోణంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి.పదవుల భర్తీలో జరుగుతున్న జాప్యానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వైఖరే కారణమని పార్టీలోని ఒక వర్గం గట్టిగా భావిస్తోంది. పార్టీ తరఫున ప్రభుత్వంపై సరైన ఒత్తిడి తేవడంలో, నిరంతర ఫాలోఅప్ చేయడంలో నాయకత్వం విఫలమైందన్నది వారి ప్రధాన ఆరోపణ. పదవుల కాలపరిమితి ముగిసి, రెన్యువల్స్‌పై స్పష్టత రావలసిన కీలక సమయంలో అధినేత అందుబాటులో లేకపోవడం వల్లే సమస్య చిక్కుముడిగా మారిందనిగాంధీభవ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.అయితే, ఈ విమర్శలను పీసీసీ తీవ్రంగా ఖండిస్తోంది. పదవులు సాధించాక పార్టీని, క్షేత్రస్థాయి శ్రేణులను పట్టించుకోని వారికి మళ్లీ అవకాశం ఇచ్చేది లేదని మహేష్ గౌడ్ స్పష్టం చేయడమే ఈ అసంతృప్తికి అసలు కారణమని పీసీసీ వర్గాలు అంటున్నాయి. నామినేటెడ్ పదవి లభించిన తర్వాత కూడా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే రెన్యువల్స్ ఉంటాయని, పనిచేయని వారికి చెక్ పెట్టాలనే సీరియస్ నిర్ణయం వల్లే కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేస్తున్నాయి.ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ ఒకే మాటపై ఉన్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల భర్తీలో పూర్తిస్థాయి పారదర్శకత, పనితీరు ఆధారంగానే ఎంపిక ఉండాలని భావిస్తున్నారు. అందుకోసం ఒక నయా ఫార్ములాను అమలు చేయాలని యోచిస్తున్నారు. సుదీర్ఘకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కొత్త నాయకులతో ముందుగా ఖాళీగా ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేయాలనుకుంటున్నారు. కొత్తవారి ఎంపిక పూర్తయిన రెండు నెలల తర్వాత మాత్రమే పాతవారి రెన్యువల్స్‌పై చర్చించనున్నారు. ఇలా చేయడం వల్ల ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులకు తక్షణ ఊరట లభిస్తుందని పార్టీ యోచిస్తోంది.ప్రస్తుతం తలెత్తిన చిక్కుముడిని విప్పేందుకు అధిష్ఠానం రంగంలోకి దిగుతోంది. ఈ వారంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌లు ప్రత్యేకంగా భేటీకానున్నారు. ఈ కీలక సమావేశంలోనే నామినేటెడ్ పోస్టుల జాబితాపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి రోజుల్లోనే నామినేటెడ్ పదవులను పూర్తిస్థాయిలో భర్తీ చేసి ఉంటే ఇప్పుడు ఈ గందరగోళం ఉండేది కాదనేది మెజారిటీ నాయకుల అభిప్రాయం. జరిగిందేదో జరిగిపోయినా.. ఇప్పటికైనా అధిష్ఠానం చొరవ తీసుకుని, నిజమైన కార్యకర్తలను గుర్తించి త్వరితగతిన పోస్టులను నింపాలని కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నాయి

## కరెంట్ కోతలకు నిరసనగా రైతుల రాస్తారోకో

**నల్గొండ: పెన్ పవర్:** తిప్పర్తి మండలం ఇండ్లూర్ గ్రామంలో కరెంట్ కోతలకు నిరసనగా రైతులు ఆందోళనకు దిగారు. కరెంటు పోతుందని ఫోన్ చేస్తే వెళ్లి మంత్రి కోమటిరెడ్డిని అడగండని అంటున్నారని ఆరోపించారు. సబ్ స్టేషన్ ఎదుట రైతుల రాస్తారోకో నిర్వహించారు. సబ్ స్టేషన్ ఎదుట తిప్పర్తి - నకిరేకల్ రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి రాస్తారోకో చేసారు. కరెంట్ కోతలతో వరి నార్లు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ అధికారులు అందుబాటులో ఉండరని, ఫోన్లు ఎత్తరని ఆరోపించారు. తమ గోడు మంత్రి కోమటిరెడ్డి పట్టించుకోవాలని డిమాండ్ చేసారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండా రైల్వే స్టేషన్ సమీపంలో ఒక గూడ్స్ రైలు ప్రమాదానికి గురైంది. ప్రమాద వివరాలు: గూడ్స్ రైలుకు చెందిన ఒక వ్యాగన్ పట్టాలు తప్పి పక్కకు ఒరిగిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు మరియు ఉన్నతాధికారులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకున్నారు. పునరుద్ధరణ చర్యలు: రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ప్రయాణీకుల రాకపోకలు: ప్రయాణీకులకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ఇతర ప్లాట్ఫారమ్ల ద్వారా రైళ్ల రాకపోకలను అధికారులు సజావుగా కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్

**నిజామాబాద్, జూలై 22 పెన్ పవర్:** తెలంగాణలో విద్యా వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు, నకిలీ హాజరు విధానానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్టూడెంట్-టీచర్స్ (ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు) పరీక్ష ఫీజు చెల్లించాలన్నా, లేదా వార్షిక పరీక్షలకు హాజరు కావాలన్నా బయోమెట్రిక్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు డేటా అత్యంత కీలకం కానుంది. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోద య్యే హాజరును పరీక్షల అర్హత ప్రక్రియతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది.నూతనంగా ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ హాజరు అనుసంధాన ప్రక్రియ 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు కానుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ నిర్వహణలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలు ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలలకు ఇది వర్తిస్తుంది.డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా సేకరించే డేటాను విద్యార్థుల పరీక్షల అర్హతను నిర్ణయించేందుకు ప్రామాణికంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, తగిన హాజరు శాతం లేని విద్యార్థి ఉపాధ్యాయులు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కోల్పోతారు.సాధారణంగా గతంలో విద్యాసంస్థలు మాన్యువల్‌గా పంపే అటెండెన్స్ రిజిస్టర్ల ఆధారంగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేవారు. దీనివల్ల కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులు క్లాసులకు రాకపోయినా హాజరు ఉన్నట్లు చూపించే అక్రమాలు జరిగే అవకాశం ఉండేది.కానీ ఈ కొత్త విధానం ప్రకారం, ప్రతిరోజూ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా విద్యార్థి ముఖాన్ని స్కాన్ చేసి హాజరును ఆన్‌లైన్ సర్వర్‌లో నమోదు చేస్తారు. పరీక్షల నోటిఫికేషన్ విడుదలైనప్పుడు, విద్యార్థి నిర్దేశిత శాతం (ఉదాహరణకు 75 శాతం లేదా 80 శాతం) హాజరును కలిగి ఉంటేనే పరీక్షల పోర్టల్‌లో సదరు విద్యార్థి ఐడీ ఓపెన్ అవుతుంది. అప్పుడే పరీక్ష ఫీజు చెల్లింపునకు, హాల్ టికెట్ జనరేషన్‌కు సిస్టమ్ అనుమతిస్తుంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా రిజెక్ట్ చేస్తుంది.ఈ సమగ్ర డిజిటల్ అనుసంధాన వ్యవస్థ ద్వారా విద్యాశాఖ పలు కీలక ప్రయోజనాలను ఆశిస్తోంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత వస్తుంది. అర్హులైన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే నిజమైన విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాసేలా ఈ విధానం నిర్ధారిస్తుంది.మాన్యువల్ డేటా ఎంట్రీ, హాజరు లెక్కింపుల వల్ల జరిగే కాలయాపన తప్పుతుంది. డిజిటల్ డేటా నేరుగా పరీక్షల విభాగానికి లింక్ అవ్వడం వల్ల సమయం ఆదా అవుతుంది. కాబోయే ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరవడం ద్వారా ప్రాథమిక విద్యా బోధనలో అత్యుత్తమ నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యా రంగంలో జవాబుదారీతనాన్ని మరింత పెంచుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మహాకవి దాశరథికి సీఎం రేవంత్ నివాళులు


**హైదరాబాద్ పెన్ పవర్:** సాహితీయోధుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలుచుకుని తెలంగాణ ఉద్యమానికి అక్షరసైనికుడిగా నిలిచిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ తెలంగాణ ఆత్మను, ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని చిరస్థాయిగా చాటిచెప్పారు. ఆయన కవిత్వం స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తరతరాలకు స్ఫూర్తినిస్తూ, తెలంగాణ సాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచింది" అని పేర్కొన్నారు.

## నిర్మల్ పట్టణంలో దొంగల హల్ చల్

**నిర్మల్: పెన్ పవర్:** కేంద్రంలోని వెంకటాపూర్ ఎస్సీ కాలనీలో నిన్న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తాళం వేసి ఉన్న మూడు ఇండ్ల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి దోపిడీకి తెగబడ్డారు ఐదు తులాల బంగారం 40 గ్రాముల వెండి, 40 వేల రూపాయల నగదును దోచుకుని వెళ్లారు . ఈ సందర్భంగా కాలనీకి చెందిన యువకుడు మాట్లాడుతూ నిన్న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు తలం వేసి ఉన్న మూడు ఇండ్ల తాళాలు పగలగొట్టి సూర్యకి పాల్పడ్డారని, పెద్ద ఎత్తున బంగారం వెండి నగలు 40 వేల రూపాయల నగదును దోచుకుని వెళ్లారని డి.ఎస్.పి సీఐ లు వచ్చే పరిశీలించారని, నిందితులను గుర్తించి పట్టుకొని న్యాయం చేయాలని కోరారు

# హమ్మయ్య.. వానలు పడ్డాయ్...

**అదిలాబాద్, జూలై 22, పెన్ పవర్:** ఎట్టకేలకు వరుణుడు కాస్త కరుణించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం జాడ లేక ఎండిపోతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు తాజాగా కురిసిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఎన్ లీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ జల్లులు కొత్త ఆశలను నింపాయి.ఈ వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. అడపాదడపా కురిసిన చిరు జల్లులు కూడా సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఒకవైపు పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోగా, మరోవైపు వర్షం కోసం రైతులు కళ్లు కాయలు కాచే పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణించాలని జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కూడా నిర్వహించారు.పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు అందరినీ కదిలించాయి. కొందరు స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తూ పంటలను బతికించేందుకు శ్రమించగా, మరికొందరు ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీళ్లు తీసుకొచ్చి మొలకలకు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. వర్షాభావం కారణంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న రైతులకు ఈ వాన కొంత ఊరటనిచ్చిందనే చెప్పాలి.మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన ముసురు క్రమంగా జిల్లాలోని పలు



ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలం బరంపూర్‌లో అత్యధికంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో అత్యల్పంగా 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, భైంసాలో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా, తాజాగా కురిసిన వర్షం మాత్రం కొంత ఆశను నింపింది.ఇన్ని రోజులుగా వాన కోసం ఎదురు చూసిన రైతులకు ఈ జల్లులు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఎండిపోతున్న పంటలకు తేమ అందడంతో అవి మళ్లీ కోలుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు ఇలాగే కరుణిస్తే ఈ సీజన్‌లో పంటలను కాపాడుకోవచ్చనే నమ్మకం రైతుల్లో కనిపిస్తోంది.

# రాహుల్ గాంధీ అరెస్ట్ బిజెపి నియంతృత్వానికి నిదర్శనం





**గార్ల, పెన్ పవర్, జులై 22:** ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం బిజెపి పార్టీ నియంతృత్వానికి నిదర్శనమని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టులను ఖండిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ గార్ల మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ లో నిర్వహించిన ధర్నాలో గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ తో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ తో లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులు యువజన సంఘాలు చేపట్టిన నిరసనలకు మద్దతుగా నిలిచిన లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎంపి ప్రియాంక గాంధీ, మరి కొంతమందిని అరెస్టు చేయడమే కాకుండాకేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలగాలను ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమన్నారు. పేపర్ లీకేజీపై కేంద్రాన్ని ప్రశ్నించినందుకే ఈ అరెస్టులు జరిగాయని, ఇది అప్రజాస్వామికమని కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడుతోందని, ప్రశ్నించే గొంతులను అణచివేయడం మానుకొని విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు గంగావత్ రామ్ సింగ్, గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరాం, మర్రిగూడెం

సర్పంచ్ భూక్యా రామ్ సింగ్, ములకనూరు సర్పంచ్ వెంకట్రావు, మాజీ జెడ్పిటిసి జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఉప సర్పంచులు మహమ్మద్ జరీనా బేగం, శ్రీనివాస్ శివకృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అందనాలా రాజీవ్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల పాలిత్య కిషన్, షేక్ యాకూబ్ పాషా, కట్ట శ్రీనివాస్, బానోత్ మల్లిబాబు, పళ్ళ నరసయ్య, కోళ్ల కుమార్ గౌడ్, భూక్యా అశోక్, హతీరామ్, భూక్యా బాబూలాల్, పటాన్ ఇమ్రాన్ ఖాన్, రమేష్ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన బెడ బుడగ జంగాలకు ఇళ్ళ స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి





**గార్ల పెన్ పవర్, జూలై 22:** పొట్ట కూటి కోసం సంచార జీవితం గడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్న అర్హులైన బెడ బుడగ జంగాలకు ఇళ్ళ స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు. మండలం లోని ముల్కనూర్ పంచాయతీ లో నివాసం ఉంటున్న బెడ బుడగ జంగాలకు ఇళ్ల స్థలాలు,ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, ఎంపీడివో కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాల పోషణ కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా జీవన భృతిని కల్పించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బుడగజంగాలు నివసిస్తున్న కాలనీలలో సిసి రోడ్లు,డ్రైనేజీలు, మంచి నీటి సౌకర్యాలు,ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మూడు తరాలు గా తాత ల కాలం నుండి ప్రభుత్వ స్థలశీ లో నివాసాలు ఉంటున్న వారిని రెవెన్యూ భూములలో ఉంటున్నారని అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని వెంటనే వారిపై వేధింపు లు మానాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ శ్రీరామ్ రాథోడ్, ఎంపీడీవో మంగమ్మ ల కు అందజేశారు. ముందుగా బేడ బుడగాల సంక్షేమ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక మంగపతి రావు భవనం నుండి పట్టణ పురవీధుల మీదుగా తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వరకు భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్య,కా,స మండల కార్యదర్శి వి.పి వెంకటేశ్వర్లు, బేడ బుడగ సంఘాల నాయకులు పస్తం సమ్మయ్య, భూతం వెంకటేష్, మెటశీ, వీరన్న, కొండపల్లి శ్రీను, కోటేశ్, కోటయ్య, శ్రీను, లక్ష్మీనారాయణ, రమేష్, బిక్షం,రవి, రాములు, రామారావు, వెంకన్న, తదితరులు ఉన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు పెడితే కఠిన చర్యలు



**గార్ల, పెన్ పవర్, జూలై 22:** డీజే నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నిబంధనలకు విరుద్ధంగా డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని గార్ల బయ్యారం సీఐ రవీందర్, ఎస్ఐ సాయి సాయికుమార్ లు హెచ్చరించారు. బుధవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలోడీజేయజమానులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపోలీస్ అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే డీజే నిర్వహించాలని. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డీజే లేదా లౌడ్ స్పీకర్లను వినియోగించరాదని, ప్రభుత్వం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చిన సందర్భాలు మాత్రమే దీనికి మినహాయింపు ఉంటుందన్నారు. డిజె శబ్దాలు ప్రభుత్వం నిర్ణయించిన శబ్ద పరిమితిని మించకూడదని, ఆసుపత్రులు, పాఠశాలలు, కోర్టులు నిశ్శబ్ద వాతావరణ సమీపంలో సౌండ్ ని పెంచకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లను ఆక్రమించకూడదని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే అసభ్యకరమైన

పాటలను ప్రసారం చేయొద్దని హెచ్చరించారు. డీజే కార్యక్రమాలు ప్రజల ఆనందం కోసం నిర్వహించినప్పటికీ, అవి ప్రజల ప్రశాంతత, ఆరోగ్యం శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా చట్టాలను గౌరవిస్తూ నిర్వహించడం ప్రతి నిర్వాహకుడి బాధ్యతని పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారుల చట్టబద్ధమైన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, చట్టాలు ఉల్లంఘించినట్లయితే డీజే పరికరాలు స్వాధీనం చేసుకోవడం తో పాటుగా అనుమతి రద్దు చేయడమే కాకుండా వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎఎస్ఐ వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, డీజే నిర్వాహకులు, యజమానులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం



**ఖమ్మం, పెన్ పవర్, జూలై 22:** పేపర్ లీకేజీలపై ఢిల్లీలో చేపట్టిన నిరసన సందర్భంగా లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తో పాటు పలువురు ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖమ్మం రూరల్ పెద్ద తండా పరిధిలోని రామ్ లీలా ఫంక్షన్ హాల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి ఇది నిదర్శనం అన్నారు. చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై బాష్పవాయువు ప్రయోగించి లాఠీఛార్జి చేయడం అమానుషమన్నారు. దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీలపై పార్లమెంట్లో చర్చించాలని ప్రతిపక్షాలు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. యువతపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీఛార్జికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ భూక్య ఫుల్ చంద్, కాంగ్రెస్ నాయకులు అంబాల వెంకటేశ్వర్లు, కిషన్ నాయక్, సుమన్ నాయక్, భూక్య సురేష్ నాయక్, కడప నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానాన్ని పాటించాలి





**గార్ల, పెన్ పవర్, జూలై 22:** పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులుసాధించేందుకు అవకాశం ఉందని రైతులు ప్రతి ఏటా మూస పద్ధతి లో ఒకే పంట ను సాగుచేయకుండా పంట మార్పిడి విధానాలు అవలంభించాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు కోరారు. గార్ల మండల పరిధిలోని పెద్ద కిష్టాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ రాంసింగ్ అధ్యక్షతన బుధవారం రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు రైతులకు అవగాహన కల్పించారు అనంతరం ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి ని విధిగా అవలంభించాలని ప్రతి యేటా రసాయన ఎరువుల ను అధిక మొత్తం లో వాడటం వలన నేల చౌడు బారి పంటలకు ప్రతి కూలం గా మారే అవకాశం ఉన్నదని రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా బూసారం పెరగడం తో పాటుగా నేల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని ఆరోగ్య కర మైన పంటలు పండుతాయని రైతులు రసాయన ఎరువులు మితం గా వాడుతూ సేంద్రియ జీవన ఎరువులు విరివిగా వాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ మేఘన గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఉచిత హెచ్ పీవీ వ్యాక్సినేషన్



**గార్ల పెన్ పవర్, జూలై 22:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక బాలికల హైస్కూల్ లోని విద్యార్థినులకు ఉచిత హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పై విద్యార్థినులకు అవగాహన కల్పించి టీకాలు అందజేశారు అనంతరం ఈ సందర్భంగా పీ హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. బి. హనుమంతరావు మాట్లాడుతూ. పాఠశాలలో 14 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలకు హెచ్ పీవీ టీకాలు వేసినట్లు తెలిపారు. టీకా పంపిణీకి ముందే వ్యాక్సిన్ భద్రత, దాని ప్రాముఖ్యత, క్యాన్సర్ నివారణలో టీకా పాత్రపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలు ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ నేతలకు గ్రేటర్ ఎన్నికలే మొదటి టాస్క్



**హైదరాబాద్, జూలై 22 (న్యూస్ పల్స్)**

గ్రేటర్ లో జరగాల్సిన మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ తన పొలిటికల్ ఫోకస్‌ను తీవ్రం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రధాన కార్పొరేషన్లతో పాటు, నార్త్ తెలంగాణకు గుండెకాయ లాంటి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని బీజేపీ అధిష్టానం పక్కా వ్యూహాన్ని రచిస్తోంది. ఇప్పటికే నితిన్ నవీన్ మూడురోజుల పాటు పర్యటించి.. . గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని బూత్ ప్రెసిడెంట్లతో, రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన కీలక భేటీలో దీనికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైంది.ఇక్కడి సమస్యలను గుర్తించి నేతల మధ్య సయోధ్య ప్రయత్నాలు కూడా పూర్తి చేశారు.ఈ మెగా ఎన్నికల సమరానికి సంబంధించి వ్యూహాల అమలు, నిధులు, వనరుల సమీకరణ పై బీజేపీ అగ్రనాయకత్వంఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఖరారు చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, వరంగల్ అర్బన్ బెల్ట్‌లో పార్టీకి వచ్చిన భారీ ఓటింగ్ శాతాన్ని క్షేత్రస్థాయిలో సీట్లుగా మార్చుకోవడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం సోషల్ మీడియా ప్రచారానికే పరిమితం కాకుండా, ప్రతి డివిజన్‌లోనూ బలమైన ఆర్థిక, అంగబలం ఉన్న అభ్యర్థులను ఇప్పుడే గుర్తించి వారికిరూట్ మ్యాప్ ఇవ్వాలని, ఎన్నికల ఖర్చులకు వెనకాడకుండా వనరులను ముందే సర్దాలని ఈ కీలక భేటీలో నిర్ణయించారు.బీజేపీ లీడర్‌షిప్ ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్ల పరిధిలోనిశ్శబ్దంగా అంతర్గత సర్వేలు చేయించింది. సిట్టింగ్ కార్పొరేటర్ల పనితీరు, అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న యాంటీ-ఇంకంబెన్సీ , బీఆర్ఎస్ కేడర్ బలాబలాలపై స్పష్టమైన రిపోర్ట్ సిద్ధం చేసుకుంది. ఈ సర్వేనివేదికల ఆధారంగానే వరంగల్ కార్పొరేషన్‌లో ఈసారి క్లీన్ స్వీప్ చేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. వరంగల్‌లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్రమంగా పడిపోతుండటం, కాంగ్రెస్ అంతర్గత విభేదాలు తమకుకలిసివస్తాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఇటు హైదరాబాద్ పరిధిలోని సైబరాబాద్, మల్కాజ్‌గిరి ఐటీ, అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను,ప్రచారాస్త్రాలుగా మార్చుకోనున్నారు.ప్రస్తుతానికి అధికార కాంగ్రెస్ పార్టీ నగరాల్లో పట్టు కోసం చూస్తుండగా, పాత బస్తీక పరిమితమైన ఎంఐఎం తో దోస్తీ కట్టి లబ్ది పొందాలని చూస్తోంది.. దీనిని హిందూ-ఓటర్లలో సెంటిమెంట్‌గా మార్చాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. రాబోయే రెండు, మూడు నెలల్లోనే ఈ గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున.. అభ్యర్థుల ఎంపిక నుండి పోలింగ్ బూత్‌మేనేజ్‌మెంట్ వరకు అంతా ముందే సెట్ చేసుకోవాలనే కమల వ్యూహం, తెలంగాణ కార్పొరేషన్ పీఠాలపై ఏ మేరకు జెండా పాతేలా చేస్తుందో చూడాలి.

# వరంగల్ విమానాశ్రయానికి రూ.497 కోట్లు

వరంగల్, జూలై 22 (న్యూస్ పల్స్)

తెలంగాణలోని వరంగల్ మామ్నూర్ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మామునూరు ఎయిర్‌పోర్టును రూ.496.86 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రన్‌వే, అప్రాన్, ట్యాక్సీవే మరియు బౌండరీ వాల్ నిర్మాణం వంటి మౌలిక వసతుల పనుల కోసం ప్రాథమిక టెండర్లను కూడా ఏఏఐ విడుదల చేసింది. మామ్నూర్ విమానాశ్రయ నిర్మాణ పనులు భూసేకరణ, అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తయిన తర్వాతే వేగవంతం కానున్నాయి. మామునూరు ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే సమయం పూర్తిగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయంపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. వరంగల్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.496.86 కోట్ల అంచనాతో అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు ఈ సమాధానం ఇచ్చారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయ్యే సమయం అనేది భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉడాన్ స్కీమ్ కింద తెలంగాణ నుంచి ఇప్పటివరకు 58 విమాన మార్గాలు అందుబాటులోకివచ్చాయని తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనాన్ని ఏఏఐ ఇప్పటికే పూర్తి చేసి, అక్కడ అవసరమయ్యే భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది.రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై స్పందించారు.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఉమ్మడిగా ఉపయోగించుకోవడానికి ఉన్న అవకాశాలపై ఏఏఐ అధ్యయనం చేసి, అవసరమైన భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలో ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఫిబ్రవరిలోనే సమర్పించినట్లు చెప్పారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెంలోని రామవరం, చెంచుపల్లి, సుజాతనగర్ పరిధిలోని స్థలాల్లో ఏఏఐ విచారణ జరపగా, అక్కడ ఉన్న కొండలు, రైల్వే లైన్ల కారణంగా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు వివరించారు.తెలంగాణలో కొత్తగా ఎలాంటి మెట్రో రైలు ప్రాజెక్టులకూ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫస్ట్ ఫేజ్ రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అమలు చేసిందని, ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్ర ఆర్థిక శాఖ రూ.1,204 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎలాంటి మెట్రో ప్రాజెక్టూ అమల్లో లేదని స్పష్టం చేశారు.

# తెలంగాణకు భారీగా రియల్ ఆదాయం

**హైదరాబాద్, జూలై 22 (న్యూస్ పల్స్)**

భారతదేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది. 2026 ఏడాది మొదటి అర్ధభాగంలో నగరంలో ఇళ్లు, ప్లాట్ల కొనుగోళ్లు ఊహించని రీతిలో పుంజుకున్నాయి. తాజా గణాంకాల ప్రకారం.. ఈ ఆరు నెలల కాలంలో హైదరాబాద్ వ్యాప్తంగా మొత్తం 37,992 ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 36,213 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధిని సూచిస్తోంది. ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల కల్పన వంటి సానుకూల అంశాలు నగర రియాల్టీకి మరింత బూస్ట్ ఇచ్చాయి.ఈ రిజిస్ట్రేషన్ల జోరుతో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. గత ఆరు నెలల్లో రియల్ ఎస్టేట్ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఏకంగా 4,118 కోట్ల ఆదాయం లభించింది. గత ఏడాది వసూలైన రాబడితో పోలిస్తే ఇది ఏకంగా 52 శాతం అద్భుతమైన వృద్ధిని నమోదు చేయడం విశేషం. జూన్ నెలలో ప్రభుత్వం భూముల ప్రభుత్వ విలువల సవరణ చేపట్టబోతుందనే ముందస్తు అంచనాలతో, మే నెలలోనే అత్యధిక సంఖ్యలో కొనుగోలుదారులు తమ రిజిస్ట్రేషన్లను ముగించుకోవడం కూడా ఈ ఆదాయ విప్లవానికి ఒక ప్రధాన కారణమైంది.నెలవారీ విశ్లేషణను పరిశీలిస్తే.. మే 2026 నెల మార్కెట్ చరిత్రలోనే అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఈ ఒక్క నెలలోనే ఏకంగా 8,344 రిజిస్ట్రేషన్లు జరిగాయి, ఇది గత ఏడాదితో పోలిస్తే 33 శాతం కంటే ఎక్కువ వృద్ధి. అయితే, మే నెలలో ముందస్తుగా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరగడం , జూన్ 5 నుండి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి రావడంతో.. జూన్ నెలలో మార్కెట్ స్వల్పంగా నెమ్మదించింది. గత ఏడాది జూన్‌లో 6,391 రిజిస్ట్రేషన్లు జరగ్గా, ఈ ఏడాది జూన్ నాటికి అది స్వల్పంగా తగ్గి 5,560 కి చేరింది.ఈ నివేదికలో గమనించాల్సిన మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు ప్రీమియం హౌసింగ్ వైపు వేగంగా మళ్లుతోంది. మొత్తం మార్కెట్ వాటాలో ఈ కేటగిరీ ఇళ్లే ఏకంగా 26 శాతం వాటాను కైవసం చేసుకున్నాయి. మరోవైపు, ఒకప్పుడు మార్కెట్‌ను శాసించిన ?25 లక్షల లోపు ఉండే బడ్జెట్ ఇళ్లు , ప్లాట్ల కొనుగోళ్లు క్రమంగా క్షీణించడం.. హైదరాబాద్ కొనుగోలుదారుల మారుతున్న ప్రాధాన్యతలను , పెరిగిన కొనుగోలు శక్తిని స్పష్టం చేస్తోంది.

# జెన్ జీ జపంలో గులాబీ

**హైదరాబాద్, జూలై 22 పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేస్తోంది. ఇప్పటిదాకా గ్రామీణ ఓటర్లు, రైతాంగ సమస్యలు, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల చుట్టూనే తమ రాజకీయ వ్యూహాలను తిప్పిన BRS, ఇప్పుడు రూట్ మార్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో యువత, నిరుద్యోగులే లక్ష్యంగా ఒక పక్కా పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు' బీఆర్ఎస్ రాబోయే రాజకీయ కార్యాచరణకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఊహించని స్థాయిలో తరలివచ్చిన యువత, ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అమలుపై వ్యక్తం చేసిన నిరసన ప్రభుత్వంపై ఎంతటి అసంతృప్తి ఉందో స్పష్టం చేసింది. ఈ జనాగ్రహాన్ని క్యాచ్ చేస్తూ, నిరుద్యోగ సమస్యననే రాబోయే రోజుల్లో తమ ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది.ఈ వ్యూహంలో అత్యంత ఆసక్తికరమైన అంశం... జాతీయ, అంతర్జాతీయ పరి ణామాలను స్థానిక రాజకీయాలకు కేటీఆర్ జోడించిన తీరు! ఇటీ వల నేపాల్‌లో యువత చేపట్టిన 'జెన్ జీ మూవ్‌మెంట్' సంచల నం సృష్టించిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఇదే పాయింట్‌ను కేటీఆర్ తన డిజిటల్ వ్యూహంలో భాగం చేసుకున్నారు. పది నెలల క్రితం తాను చేసిన ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ "ప్రభుత్వాలు జెన్ జీ, యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రపంచ పరిణామాలే నిదర్శనం" అని పేర్కొన్నారు. నిరుద్యోగ తిరుగుబాటును తాను ముందే ఊహించాననే చర్చకు ఇది గట్టి పునాది వేసింది.బీఆర్ఎస్ కొత్త స్ట్రాటజీ వెనుక కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి. కేవలం పల్లెలు, రైతులకే పరిమితం కాకుండా పట్టణాల్లోని గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు,ఉద్యోగార్థులను తమ వైపు తిప్పుకునే స్కెచ్ ఉంది. గ్రూప్ ఎగ్జామ్స్ రద్దు, నోటిఫికేషన్ల లీకేజీలు, నియామకాల జాప్యం వంటి అంశాలపై నిరుద్యోగుల్లో ఉన్న ఆక్రోశానికి నాయకత్వం వహించడం ద్వారా వాళ్లకుతాము అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మొండి తనం మోడీ కొంప ముంచుతోందా?



రెండు రోజుల తక్కువ 25 నెలలు. అర్థం కాలేదా? అదేనండి రెండేళ్ల ఒక నెల. కాస్త కన్ఫ్యూజింగ్ గా ఉందా? సూటిగా చెప్పాలంటే ముచ్చటగా మూడోసారి భారత దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో ప్రభుత్వాన్ని కొలువు తీర్చింది 2024 జూన్ 24. అంటే.. ఈ రోజుకు (జులై 22) రెండు రోజులు తక్కువగా 25 నెలలు. తిరుగులేని అధిక్యతతో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో కొలువు తీరుతుందన్న అంచనాలకు భిన్నంగా.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రావటం.. బీజేపీ సొంతంగా సాధిస్తుందని భావించిన లోక సభ సీట్లకు భిన్నంగా..తొలిసారి మిత్రపక్షాల మీద ఆధారపడాల్సిన అరుదైన సందర్భం అప్పట్లో చోటు చేసుకుంది. సుదీర్ఘ కాలం తర్వాత భారత ప్రధానిగా హ్యాట్రిక్ సాధించిన బలమైన ప్రధానిగా నరేంద్ర మోడీ అవతరించారు. అయితే.. ఆయనకు హ్యాట్రిక్ హానర్ తో పాటు.. ఒక హెచ్చరికను సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో భారత ఓటర్లు ఇచ్చిన విషయాన్ని మర్చిపోకూడదు. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇస్తూనే.. గత ఫలితాలకు భిన్నంగా తమకున్న అసంతృప్తిని స్పష్టంగా చెప్పేస్తూ.. పాలనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. మొదటి రెండు ప్రభుత్వాల సమయంలో మోడీకి ఎదురైన సవాళ్లకు భిన్నంగా మూడోసారి ప్రభుత్వ హయాంలో ఎదురవుతున్నాయి. ఇక్కడ మరో అంశాన్ని ప్రస్తావించాలి. నిజానికి వరుసగా మూడుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అరుదైన అవకాశం అందరికి రాదు. అలా వస్తే మరింత అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉంటుంది. వరుస ప్రభుత్వాలను ఏర్పాటు చేసే వారికి ఒక వెసులుబాటు ఉంటుంది. వారికంటూ ఒక టీం ఏర్పడటంతో పాటు.. తమదైన ఎజెండాతో ముందుకు సాగే వీలు ఉంటుంది. మధ్యలో వేరే ప్రభుత్వాలు ఏర్పాటైన తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రాధాన్యతలు మొదలు.. అధికార యంత్రాంగాన్ని ఒక దారికి తేవటానికి చాలా సమయం పడుతుంది. అలాంటి తలనొప్పులు తగ్గుతాయి. అయితే.. ఏ పార్టీ అయినా బ్యాక్ టు బ్యాక్ రెండుసార్లు అధికారంలో ఉన్నప్పుడు.. ప్రభుత్వ వ్యతిరేకత సహజం. అందునా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు.. ప్రజల్లో కనిపించనట్లుగా ఉండే అసంత్రప్తికి.. విపక్షాలు సరైన అంశాల్ని తెర మీదకు తీసుకురావటం ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడిని ఇన్ స్టెంట్ గా పెంచే ముప్పు పొంచి ఉంటుంది. ఈ విషయాలన్నీ మోడీకి తెలియనివి కావు. గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయి నుంచి ప్రధానిగా ఆయన ప్రయాణం అందరికి తెలిసిందే. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి కేశు భాయ్ పటేల్ అనారోగ్య కారణాలతో తప్పుకోవటం.. ఆయన స్థానంలో నరేంద్ర మోడీని ముఖ్యమంత్రిని చేశారు. స్వల్ప వ్యవధిలోనే ఆయన సీఎం హోదాలో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన ఆయన.. మొత్తంగా మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్ని ఎదుర్కొని పార్టీని విజయ తీరాలకు చేర్చారు. నాలుగుసార్లు నాన్ స్టాప్ గా గుజరాత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. నాలుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నరేంద్ర మోడీ.. తన సొంత రాష్ట్రాన్ని వీడినా.. ఆ రాష్ట్రంలో బీజేపీకి కంచుకోటగా నిలపటంలో సక్సెస్ అయ్యారు. ఇదంతా చూస్తే.. విజయాన్ని సాధించటం.. దాన్ని నిలుపుకోవటం.. కొనసాగించే విషయంలో మోడీ ట్రాక్ రికార్డు తిరుగులేని రీతిలో ఉంటుందని చెప్పాలి. కానీ.. ఆయనలోని కొన్ని లోపాలు.. వ్యక్తిత్వ తీరు కొత్త తలనొప్పులకు కారణమవుతున్నాయని చెప్పాలి. తన వారు ఎవరైనా సరే.. వారిపై వచ్చే విమర్శలు.. ఆరోపణల విషయంలో చర్యలు తీసుకోవటానికి మోడీ ససేమిరా అనేసేలా వ్యవహరిస్తుంటారు. నిజానికి సంఘ్ పరివార్ తీరు కూడా ఇలానే ఉంటుంది. ఏమైనా నాలుగు గోడల మధ్య విషయం ఉండాలే కానీ.. బయటకు వచ్చి రచ్చ అయిన తర్వాత ఆ విషయంలో వెనక్కి తగ్గే తత్త్వం ఉండదంటారు. ఇందు కు నిదర్శనంగా 2021లో ఢిల్లీ శివారులో పంజాబ్ రైతులు చేపట్టిన రైతు ఉద్యమాన్నే తీసుకుంటే.. నెలల తరబడి సాగినా.. వెనక్కి తగ్గకపోవటమే కాదు మొండిగా వ్యవహరించారు. నిజానికి ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎదుర్కొన్న అత్యంత గడ్డు పరిస్థితి ఇదే. కొవిడ్ లో సమస్యలు ఎదుర్కొన్నా.. ఆయన ప్రభుత్వ నిర్ణయాల మీద ప్రజల్లో వ్యతిరేకత రాలేదు. అందుకు భిన్నంగా రైతు ఉద్యమంతో మోడీ ప్రభుత్వ ఇమేజ్ డ్యామేజ్ పరంపర ఒకటి తర్వాత ఒకటి చొప్పున పెరుగుతూ పోతోంది. 2023లో భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు కం బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మీద మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణ మోడీ ప్రభుత్వ ఇమేజ్ ను దెబ్బ తీసింది. ఈ సందర్భంలోనూ మోడీ అంతులేని మౌనాన్ని ప్రదర్శించారు. ప్రతి చిన్న అంశానికి వెంటనే స్పందించే తీరుతో మోడీ దేశ ప్రజల్ని విపరీతంగా ఆకట్టుకున్నారు. అంతకుముందు ప్రధానమంత్రులుగా పని చేసిన వారంతా జాతీయస్థాయి అంశాలపైనే స్పందించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మొదట్లో మోడీ.. ఒక రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో చోటు చేసుకున్న అంశంపై స్పందించటం.. ఆ అంశాల గురించి వివరాలు సేకరించాలని ఆదేశించటం..ఆరా తీయటం లాంటివి పెద్ద ఎత్తున వినిపించేవి. ఆయన ముందు పదేళ్లు ప్రధానమంత్రిగా వ్యవహరించిన మన్మోహన్ సింగ్ మౌన ప్రధానిగా చూసి.. చూసి విసిగిపోయిన దేశ ప్రజలకు మోడీ స్పందన అత్యద్భుతమన్నట్లుగా ఉండేది. అయితే.. తన ఇమేజ్ ను పెంచే అంశాల మీద వేగంగా స్పందించే ఆయన.. ఏదైనా తీవ్రమైన ఆరోపణ.. సమస్యలపై నిరసన వ్యక్తం చేసే వారి విషయంలోనూ.. న్యాయం కోసం రోడ్డెక్కే వారి విషయంలో ఆయన తీరు భిన్నంగా ఉండేది. ఇది పెద్ద ఎత్తున విమర్శలకు తావిస్తున్న పరిస్థితి. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఉదంతంలో ఒలింపిక్ విజేతలు సాక్షి మాలిక్.. బజరంగ్ పునియా.. వినేష్ ఫోగట్ లాంటి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మహిళా క్రీడాకారులు సైతం న్యాయం కోసం.. చర్యల కోసం నెలల తరబడి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోరాటం చేయాల్సి రావటం..మోడీ ఇమేజ్ ను తీవ్రంగా ప్రభావితం చేసిందని చెప్పాలి.

చివరకు తమ వంతుగా దేశానికి సాధించుకు తీసుకొచ్చిన పతకాల్ని మహిళా క్రీడాకారులు గంగా నదిలో పారేసేందుకు హరిద్వార్ కు వెళ్లటం.. వారు పెట్టుకున్న కన్నీరు దేశ ప్రజల్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. బాధితులు స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ముందుకు రాలేదు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే కేసు నమోదు చేయటం లాంటి అంశాలు మోడీ సర్కారు తీరుపై విమర్శలు గుప్పించేలా మారాయి.
సీఏఏ వ్యతిరేక ఆందోళనలు మోడీ సర్కారును ఇబ్బంది పెట్టినా.. దేశం మొత్తం కదిలే పరిస్థితి లేదు. దీనికి భిన్నంగా ఆపరేషన్ సింధూర్ ఎపిసోడ్ లో ప్రభుత్వానికి రావాల్సినంత ఇమేజ్ రాకపోగా.. కొత్త సందేహాలకు తెర తీసి.. మిశ్రమ చర్చకు తెర తీసింది. నిజానికి ఇదో పెద్ద ఎదురుదెబ్బగా పలువురు విశ్లేషించిన పరిస్థితి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. నీట్ పరీక్ష లీకేజీపై చర్యలు తీసుకోవాలని.. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మంద్రే ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్ చూస్తుండగానే చిలికి చిలికి గాలివానలా మారింది. ఈ ఉదంతంపై పోరు సుదీర్ఘంగా సాగటమే కాదు.. నీట్ పరీక్ష మరోసారి నిర్వహించి.. ఫలితాలు వెల్లడించిన తర్వాత కూడా పూర్వపు పరీక్ష లీకేజీ మీద దేశ రాజధానిలో జరుగుతున్న రగడ.. దానికి యువత పెద్ద ఎత్తున రోడ్ల మీదకు రావటం చూసినప్పుడు.. దీనంతటికి మోడీ కారణమన్న భావన కలుగక మానదు. తన జట్టులోని వారిపై వచ్చే ఆరోపణలు.. విమర్శలకు స్పందించటం.. వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు పడని తీరు.. మోడీ సర్కారుకు ఒక బలహీనతగా మారిందని చెప్పాలి. చివరకు ఆయన తన పదవికి రాజీనామా చేయాలని విపక్ష కాంగ్రెస్ గొంతు సవరించుకునే వరకు వెళ్లింది. సుదీర్ఘ మౌనాన్ని విడిచి.. నీట్ పేపర్ లీక్ మహాపాపం అంటూ ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ వ్యాఖ్యానించటం చూస్తే.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందమన్న సామెత గుర్తుకు రాక మానదు.
నిజానికి.. ఇదే మాట ముందే చెప్పేసి.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ఏకరువుపెట్టి ఉంటే.. ఈ రోజున కాక్రోచ్ పార్టీకి కానీ.. విపక్షాలకు కానీ నిరసనలకు అవకాశమే ఉండేది కాదు. తన ప్రభుత్వంపై పోరాటానికి ఎజెండా సిద్ధం చేసుకునే అవకాశం మోడీ తన మొండితనం.. తన వారిపై ఈగ వాలొద్దన్నట్లుగా వ్యవహరించటంతో పాటు.. ఎవరో ఏదో అడిగితే.. నా వాళ్ల మీద చర్యలు ఎందుకు తీసుకోవాలన్న తీరు.. చివరకు ఆయనకే ఎసరు పెట్టేలా మారటం గమనార్హం. అదే పనిగా చేస్తున్న తప్పులను మోడీ గుర్తించి సరి చేసుకుంటారా? లేదంటే.. తాను మినహా మరెవరూ లేరన్న భావన కలిగించే విషయంలో సక్సెస్ అయిన మోడీ.. అందుకు భిన్నంగా కాక్రోచ్ పార్టీ లాంటి సరికొత్త రాజకీయ పార్టీ స్థాపనకు తానే అవకాశం కల్పిస్తారా? అన్నది ప్రశ్న. అందుకు కాలమే సరైన సమాధానం చెబుతుంది.

# మీరు గాడ్సే వారసులు: బీజేపీపై రేవంత్ రెడ్డి ఫైర్



నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యత వహిస్తూ.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలో గాడ్సే వారసులు పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు చేపట్టిన నిరసనలో రాహుల్ గాంధీని అరెస్టు చేసిన తీరును ఆయన ఖండించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన నిరసనలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నీట్ ప్రశ్న పత్ర లీకేజీ వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. వందలాది పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను లీక్ చేశారని తెలిపారు. పత్రపత్రాలను డబ్బులకు అమ్ముకుంటున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిపై బల ప్రయోగం చేయడం ఏంటని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అయి నా.. ప్రశ్నించడం ఆపబోమని చెప్పారు. పార్టీలకు అతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని.. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. --నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలి" అని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే రాజీనామా చేయించాలని కోరారు.

**రాహుల్‌ను కొట్టారు.**

నిరసనలో ఉన్న రాహుల్‌గాంధీపై ఢిల్లీ పోలీసులు నిరంకుశంగా వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆయనపై బలప్రయోగం చేశారని తెలిపారు. ఫలితంగా ఆయన ముక్కు నుంచి రక్తం కారిందన్నారు. మహాత్మా గాంధీని పొట్టన బెట్టుకున్న గాడ్సే వారసులు ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నిరసనలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖలో రియల్ షాక్

**విశాఖపట్టణం, జూలై 22 పెన్ పవర్:** ఉత్తరాంధ్ర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్ట్ ఒక గేమ్ ఛేంజర్‌గా మారిన మాట వాస్తవమే. అయితే, దీనిని ఆసరాగా చేసుకుని విశాఖ నగర శివారైన ఆనందపురం జంక్షన్ నుండి పద్మనాభం, భోగాపురం వెళ్లే కారిడార్లలో భూముల ధరలు ఇప్పుడు ఊగిసలాడుతున్నాయి. విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతుండటంతో ఇన్వెస్టర్లు ఇటువైపు మొగ్గు చూపుతారనే అంచనాలతో రేట్లు విపరీతంగా పెంచేసారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే.. ఆ రేట్లకు, ఇక్కడి వాస్తవ మార్కెట్ డిమాండ్‌కు అస్సలు పొంతన లేకపోవడంతో ధరల్లో భారీ హెచ్చుతగ్గులు కనిపిస్తూ, కొనుగోలుదారులను అయోమయంలో పడేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ధరలు స్థిరంగా ఉండకపోవడానికి ప్రధాన కారణం కొందరు బ్రోకర్లు, స్థానిక డెవలపర్లు సృష్టించిన ఊహాజనిత మార్కెట్ మాత్రమే. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చేస్తోంది కాబట్టి రాత్రికి రాత్రే ఇక్కడ భూముల విలువ కోట్లకు చేరుతుందనే కలరింగ్ ఇచ్చి, ల్యాండ్ రేట్లను అమాంతం ఆకాశానికి చేర్చారు. ఎకరం లేదా గజం ధరను వాస్తవ విలువ కంటే మూడు, నాలుగు రెట్లు పెంచి బోర్డులు పెట్టారు. అయితే, ఈ విపరీతమైన హైప్ కారణంగా సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులు ఈ జోన్ వైపు రావడమే మానేశారు. దీని ఫలితంగా.. ఆనందపురం, పద్మనాభం లోపలి పరిసరాల్లో వెలిసిన కొన్ని వెంచర్లు ఇప్పుడు కస్టమర్లు లేక వెలవెలబోతున్నాయి. ప్రారంభంలో భారీ ఆర్భాటంతో, ఆకర్షణీయమైన బ్రోచర్లతో



ప్లాట్ల అమ్మకాలు జరిపినప్పటికీ.. ఇప్పుడు అక్కడ కొనే నాథుడే కరువయ్యాడు. మున్సిపల్ అనుమతులు లేకుండా, కేవలం పంచాయతీ లేఅవుట్లతో వేసిన వెంచర్లలో పెట్టుబడి పెడితే భవిష్యత్తులో చిక్కులు వస్తాయని ఇన్వెస్టర్లు గ్రహించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆర్టిఫిషియల్ హైప్‌తో పెరిగిన రేట్లు కాస్తా.. ఇప్పుడు డిమాండ్ లేక ఒక్కసారిగా కిందికి పడిపోతున్నాయి. అందుకే ఈ కారిడార్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారు తీవ్ర అప్రమత్తతతో వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆనందపురం-పద్మనాభం బెల్ట్‌లో భవిష్యత్తు ఉన్నప్పటికీ.. కేవలం ఎయిర్‌పోర్ట్ సెంటిమెంట్‌ను నమ్మి అడ్డగోలు ధరలకు అన్-అప్రూవ్డ్ ప్లాట్లు కొని ఇరుక్కోవద్దని సూచిస్తున్నారు

# తమ్మినేనికి బిగుస్తున్న ఉచ్చు



**శ్రీకాకుళం, జూలై 22 పెన్ పవర్:** శాసనసభాపతిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి, చట్టాలను కాపాడాల్సిన స్థానంలో కూర్చుని నీతులు చెప్పిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం అక్రమాల జాతకం ఇప్పుడు ఒక్కొక్కటిగా బట్టబయలవుతోంది. ఒకప్పుడు ఆముదాలవలస రాజకీయాన్ని ఏలిన తమ్మినేని, ఆయన కుటుంబం చేసిన అడ్డగోలు భూకబ్జాలు, దొంగ రిజిస్ట్రేషన్ల దందాలు ఇప్పుడు వెలుగులోకి వస్తుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది. భూకబ్జా, ఫోర్జరీ కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే ఆలస్యం.. ఆయన తన భార్య, కుమారుడితో సహా రాత్రికి రాత్రే పరారవ్వడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బ్రతికున్న వ్యక్తులను చనిపోయినట్లు చూపిస్తూ, వారి వారసులమంటూ ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూములను కాజేసిన ఒక నకిలీ దస్తావేజుల స్కామ్ వెలుగులోకి వచ్చింది. అసలైన యజమానులు బ్రతికే ఉన్నప్పటికీ, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ కాగితాలు సృష్టించి అడ్డగోలుగా తమ పేరున దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో పోలీసులు విచారణ జరిపి తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ , తమ్మినేని సీతారాం , ఆయన భార్య తమ్మినేని వాణి లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారంలో ఉన్న సమయంలో స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని తమ్మినేని కుటుంబం ఆముదాలవలస నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో వేల గజాల ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను, ప్రభుత్వ భూములను భయభ్రాంతులకు గురిచేసి కాజేశారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. బాధిత భూయజమానులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా, నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయనకున్న రాజకీయ ప్రాబల్యం వల్ల పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయడానికి కూడా జంకారు. ఇప్పుడు ప్రభుత్వం మారడం, బాధిత కుటుంబాలు ఆధారాలతో పోలీసులను ఆశ్రయించడంతో తమ్మినేని పాపాల పుట్ట పగిలింది. శాసనసభలో సభాపతిగా విలువలు, నైతికతల గురించి గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చిన తమ్మినేని.. తీరా చూస్తే ప్రైవేటు వ్యక్తుల కష్టార్జితమైన ఆస్తులపై కన్నేసి అక్రమాలకు పాల్పడటంపై ఆముదాలవలస ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఒకప్పుడు అధికారం చూపి బెదిరించిన నేతలు, నేడు కేసు నమోదవ్వగానే చట్టం నుంచి తప్పించుకోవడానికి పరారవ్వడంపై స్థానికులు మండిపడుతుండగా, తవ్వే కొద్దీ తమ్మినేని కబ్జాల లెక్కలు మరిన్ని బయటకు రానున్నట్లు తెలుస్తోంది

**మిస్సింగ్....**

శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మరియు ఆయన కుటుంబ సభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అరెస్ట్ భయంతోనే వారు పరారయ్యారని, ప్రస్తుతం వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలుస్తోంది. చాపురం వద్ద జరిగిన ఈ ల్యాండ్ స్కామ్ వ్యవహారంలో శ్రీకాకుళం రూరల్ పోలీసులు మొత్తం 13 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో తమ్మినేని కుటుంబ సభ్యులను కీలక నిందితులుగా చేర్చారు. ఇందులో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఏ-6 గా, ఆయన భార్య తమ్మినేని వాణిని ఏ-7గా, మరియు వారి కుమారుడు తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్‌ను ఏ-5గా పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం.. చాపురం సత్యసాయి నగర్ లేఅవుట్ పరిధిలో దాదాపు రూ. 4 కోట్ల విలువైన 900 గజాల స్థలంపై ఈ వివాదం నెలకొంది. అసలు భూ యజమాని బతికి ఉండగానే, ఆయన చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించారు. అంతేకాకుండా, ఒడిశాకు చెందిన ఒక మహిళను ఆ యజమాని కుమార్తెగా చూపిస్తూ తప్పుడు వారసత్వ పత్రాల ద్వారా ఈ స్థలాన్ని తమ్మినేని కుమారుడి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆధారాలు లభించాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శ్రీకాకుళం పోలీసులు ఈ కుట్రకు సహకరించిన మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు సహా ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న తమ్మినేని సీతారాం, ఆయన భార్య, కుమారుడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి

**గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సమాచారం**

గ్రీవెన్స్ లో వృద్ధ దంపతుల ఫిర్యాదు..

కొద్దిరోజుల కిందట ఓ వృద్ధ దంపతులు తమ్మినేని కుటుంబ సభ్యులపై ఏకంగా కలెక్టరేట్ గ్రీవెన్స్ లోనే ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస టిఎస్ఆర్ కళాశాలకు సమీపంలో ఓ వృద్ధ దంపతులకు 8 సెంట్లు స్థలం ఉంది. అయితే ఆ స్థలాన్ని తమ్మినేని కుటుంబం ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేసిందంటూ ఆ వృద్ధ దంపతులు సీఎంవో తో పాటు ఎస్పీ నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో డిఆర్ఓ విశ్వేశ్వరరావు, ఆమదాలవలస తహసిల్దార్, సర్వే అధికారులు వెళ్లి స్థలాన్ని బాధితులకు అప్పగించారు. అయితే ఇది జరిగి వారం రోజుల వ్యవధి కూడా కాలేదు.. శ్రీకాకుళం లో నాలుగు కోట్ల విలువైన భూమిని అక్రమ మార్గంలో స్వాధీనం చేసుకోవడం వెలుగులోకి వచ్చింది. మరోవైపు టెక్కలి మండలం చింతామణి గ్రామంలో ఏకంగా 23 ఎకరాల భూమిని తన కుమారుడి పేరుతో బలవంతంగా రాయించుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. తమ్మినేని సీతారాం స్పీకర్ గా ఉన్న సమయంలోనే చింతామణి గ్రామంలోని 324 సర్వే నెంబర్ లో భూమిపై ఆయన కన్ను పడినట్లు తెలుస్తోంది. గ్రామస్తులను భయపెట్టి మరి బలవంతంగా రాయించుకున్నారని శ్రీకాకుళం రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో ఆమదాలవలసకు చెందిన ఓ వ్యక్తి తమ్మినేని కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అయితే ఆయన మరణించిన తర్వాత వారసులు మధ్య గొడవలు జరిగాయి. అయితే వారి ఇల్లును తమ్మినేని సీతారాం భార్య వాణి బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆమదాలవలసకు చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ అనారోగ్యంతో చనిపోయారు. అయితే తమకు కొంత మొత్తం అప్పుగా ఉన్నారని చెప్పి.. ఆయన కుటుంబాన్ని బెదిరించి ఒక ఇల్లును బలవంతంగా లాక్కున్నారని ఆరోపణ కూడా ఇప్పుడు వినిపిస్తోంది. ఇప్పుడు బాధితులు ఒక్కొక్కరు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తుండడంతో తమ్మినేని ఫ్యామిలీ చుట్టూ ఉచ్చు బిగిస్తోంది.

# ఢిల్లీ నేతల అపాయింట్ మెంట్ కోరిన జగన్

**విజయవాడ, జూలై 22 పెన్ పవర్:** మద్యం కుంభకోణం ఏపీ లో ప్రకంపనలు సృష్టించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో భారీ కుంభకోణం జరిగింది. అయితే దీనిపై ఏర్పాటైన సీట్ విచారణ తుది దశకు వచ్చింది. అంతిమ లబ్ధిదారుడు ఎవరు అనే దానిపై ఒక క్లారిటీ వచ్చింది. ప్రధానంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని విచారించేందుకు ఈడి రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో నోటీసులు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే ఈ కేసు తుది దశకు వచ్చినట్టే. జగన్మోహన్ రెడ్డి భయం కూడా అదే. అందుకే ఇప్పుడు ఆయన కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో దాదాపు 3800 కోట్ల రూపాయల మద్యం కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇది అధికారికంగా మాత్రమే. అనధికారికంగా అంతకుమించి అన్నట్టు పరిస్థితి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఎలాంటి ఆర్థిక వ్యవహారాలు అయినా డిజిటల్ లావాదేవీల రూపంలో జరుగుతున్నాయి. అటువంటిది వైసిపి హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు జరగలేదు. దీని వెనుక భారీగా మతలబు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈడి రంగప్రవేశం చేసింది. అయితే ఇప్పుడు అదే ఈడి ఏకంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి విచారణకు పిలిచేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోం ది. అదే జరిగితే జగన్మోహన్ రెడ్డికి చిక్కులు తప్పేలా లేవుప్రస్తు తం జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీతో పాటు అమిత్ షా అపాయింట్మెంట్ కోరినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో ఎప్పుడైతే ఈడి ప్రవేశం ముందు అప్పటినుంచి జగన్ లో ఒక రకమైన భయం ఏర్పడింది.ం

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ విచారణకు ఆదేశించింది. అయితే అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో.. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగం అని ప్రచారం సాగింది. కానీ ఇందులో కీలకమైనఆర్థిక ఆధారాలు, రుజువులు దొరకడంతో ఈడి ఎంట్రీ ఇచ్చింది. అప్పటినుంచి జగన్మోహన్ రెడ్డిలో భయం ప్రారంభమైనట్లు తెలుస్తోంది.. అందుకే కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు ప్రచారం సాగుతోంది. మరిఅందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

## పోలవరం కోసం క్రెడిట్ వార్

**ఏలూరు, జూలై 22 పెన్ పవర్:** పోలవరం క్రెడిట్ తమదే అని అంటోంది ఏపీ కమలదళం. కేంద్రం ఇచ్చిన నిధులతోనే పోలవరం వంటి భారీ ప్రాజెక్ట్ పూర్తి అవుతోందని గట్టిగా చెప్పుకుంటోంది. పోలవరానికి ఉదారంగా కేంద్రం ఇచ్చిన ఆర్థిక చేయూత గొప్పదని ఏపీ బీజేపీ నేతలు చెబుతున్నారు. తాజాగా ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కేంద్ర మంత్రి సహా ఎమ్మెల్యేలు కీలక నేతలు పోలవరం సందర్శన కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అండతోనే పోలవరం ప్రాజెక్ట్ కల నిజం అయింది అని బీజేపీ నేతలు అంటున్నారు. అయితే పోలవరం ప్రాజెక్ట్ వ్యవహారం ఈనాటిది కాదు. 2004లో అప్పటి ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ ని సాకారం చేయడానికి కృషి చేశారు. అనేక అనుమతులను ఆయన అయిదేళ్ళ ముఖ్యమంత్రిత్వంలోనే సాధించారు. రెండవ టెర్మ్ 2009లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే వైఎస్సార్ మరణించారు. ఆయన ఆలోచన మేరకు అయితే 2014లోగా పోలవరం పూర్తి చేస్తే ఏపీ విడిపోయినా సాగు తాగు నీటికి ఇబ్బంది రాదని అని అంటారు. అయితే అది అలా జరగలేదు. ఈలోగా 2014లో విడిపోవడమే ముందు జరిగింది. అయితే దానికంటే ముందు కేంద్రంలో యూపీయే ప్రభుత్వం పోలవరం ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తూ విభజన చట్టంలో పెట్టడమే ఏపీకి అతి పెద్ద వరం అయింది. ఇక బీజేపీ 2014 నుంచి అధికారంలో ఉంది. పోలవరం 2027 నాటికి పూర్తి అవుతుంది అనుకున్నా బీజేపీ పెద్దలకు పూర్తి చేయడానికి 13 ఏళ్ళు పట్టిందా అన్న చర్చ కూడా జనంలో నుంచి వస్తోంది. పోలవరం అడుగులు తగ్గింపు పోలవరం ప్రాజెక్టు గరిష్ట ఎత్తును 45.72 మీటర్లు అంటే 150 అడుగులుగా నిర్మించాలన్నది వాస్తవ అంచనాగా ఉంది. అయితే తొలిదశలో 41.15 మీటర్లకు అంటే 135 అడుగులు కుదించారని విపక్షాలు నుంచి విమర్శలు ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ ఇచ్చిన స్పష్టత ప్రకారం పోలవరం ప్రాజెక్టు అసలు ఎత్తు 45.72 మీటర్లుగానే ఉంటుందని అంటున్నారు. అయితే 2027 నాటికి మాత్రం 41.15 మీటర్ల ఎత్తున నిర్మించి పూర్తి చేస్తున్నారా లేదా 45.72 మీటర్ల దాకా వాస్తవ ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తున్నారా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎత్తును తగ్గించే ప్రతిపాదనను ఎప్పుడూ ఆమోదించలేదని ప్రాజెక్టు ఎప్పటికైనా 45.72 మీటర్ల ఎత్తులోనే పూర్తవుతుందని స్పష్టం చేసిన నేపథ్యంలో ఆ దిశగానే 2027లో పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి అందిస్తే బీజేపీకి ఎంతో క్రెడిట్ దక్కుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే పోలవరం ప్రాజెక్ట్ తమ క్రెడిట్ అని బీజేపీ నేతలు ఏపీకి ఇచ్చిన నిధులను లెక్కతో సహా చెబుతున్నారు. అదే విధంగా అమరావతి రాజధాని కోసం అక్కడ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇచ్చిన నిధుల గురించి కూడా ప్రస్తావిస్తున్నారు. అలాగే రాయలసీమలో ఇటీవల కాలంలో వచ్చిన ప్రాజెక్టుల వెనక కేంద్రం కృషి ఉందని గుర్తు చేస్తున్నారు ఇవన్నీ కూడా ఏపీ జనాల మెప్పు పొంది బీజేపీ ఏపీకి చేసిన మేలు ఇదని చెప్పుకోవడానికి తాపత్రయపడుతున్నారు. అయితే ప్రజలు ఈ విషయంలో క్రెడిట్ ఎవరికి ఇస్తారు అన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ పునాది వేశారు అని ఆ పార్టీ అంటోంది. అలాగే అప్పటి యూపీయే ప్రభుత్వం పోలవరానికి జాతీయ హోదా ఇచ్చి విభజన చట్టంలో పెట్టిందని అంటున్నారు. టీడీపీ అయితే తమ నిరంతర పర్యవేక్షణతోనే వేగంగా పోలవరం పూర్తి చేశామని చెబుతోంది. లేట్ గా వచ్చినా లేటెస్ట్ గా తాము కూడా క్రెడిట్ రేసులో ఉన్నామని బీజేపీ నేతలు అంటున్నారు. చూడాలి మరి పోలవరం ఎవరి రాజకీయ జాతకం మారుస్తుందో.

## ఏపీ వ్యాప్తంగా కామన్ జోనింగ్ నిబంధనలు

**విజయవాడ, జూలై 22 పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భూ వినియోగం, పట్టణాభివృద్ధిని క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే రకమైన, నిబంధనల ఆధారిత ఫ్రేమ్‌వర్క్‌ను ప్రవేశపెడుతూ కామన్ జోనింగ్ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. గతంలో 2025 అక్టోబర్ 22న మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో నంబర్ 216 స్థానంలో ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఏపీ ప్రభుత్వంఅమరావతి మినహాఈ కొత్త రూల్స్ రాష్ట్ర రాజధాని ప్రాంతం మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లోని మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు, జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్‌లకు వర్తిస్తాయి. గతంలో ఉన్న అనేక రకాల జోనింగ్ విధానాలను రద్దు చేస్తూ, కొత్త ఫ్రేమ్‌వర్క్‌లో భూ వినియోగాన్ని 9 ప్రామాణిక కేటగిరీలుగా సరళీకరించారు. అవి : రెసిడెన్షియల్ (నివాస ప్రాంతాలు), కమర్షియల్ (వాణిజ్య ప్రాంతాలు), పబ్లిక్ ఉ సెమీ-పబ్లిక్ (ప్రజా, ప్రభుత్వ అవసరాలు), రిక్రేషనల్ (వినోద ప్రదేశాలు, ఇండస్ట్రియల్ (పరిశ్రమలు), ట్రాన్స్‌పోర్టేషన్ (రవాణా రంగానికి సంబంధించినవి), మిక్స్‌డ్ యూజ్ (బహుళ ప్రయోజన జోన్లు), అగ్రికల్చరల్ (వ్యవసాయ మండలాలు), డెవలప్‌మెంట్-రెస్ట్రిక్టెడ్ జోన్లు (అభివృద్ధి నిషిద్ధ ప్రాంతాలు) ఉన్నాయి. డెవలప్‌మెంట్-రెస్ట్రిక్టెడ్' కేటగిరీ కిందకు చారిత్రక కట్టడాలు(హెరిటేజ్), రక్షణ రంగానికి చెందిన రక్షిత ప్రాంతాలు, అడవులు, కొండలు, జలవనరులు, పర్యావరణ సున్నిత ప్రాంతాలు, తీరప్రాంత నియంత్రణ జోన్లు వస్తాయి. ప్రత్యేకంగా లిస్ట్‌ఈ కొత్త నిబంధనలలోప్రభుత్వం 'జోన్ల వారీగా నెగెటివ్-లిస్ట్' విధానాన్ని తీసుకొచ్చింది. అంటే, ఒక నిర్దిష్ట జోన్‌లో ఏయే పనులను/వ్యాపారాలను చేయకూడదో (నిషేధించారో) ఆ జాబితాను మాత్రమే ఇస్తారు. ఆ జాబితాలో లేని,పర్యావరణానికి, నిబంధనలకు అనుకూలంగా ఉండే ఇతర పనులను అక్కడ చేపట్టవచ్చు. అయితే ప్రతి అభివృద్ధి పని కూడా కచ్చితంగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్, లేఅవుట్ రూల్స్, పర్యావరణ నిబంధనలు, రోడ్డు వెడల్పు, పార్కింగ్ ప్రమాణాలు, సేఫ్టీ డిస్టెన్స్ నిబంధనలకు లోబడి ఉండాలికాలుష్యం కలిగించే పరిశ్రమలు, ప్రమాదకరమైన స్టోరేజ్ గోదాములు, స్లాటర్ హౌస్‌లు, పెద్ద లాజిస్టిక్స్ కేంద్రాలు, మైనింగ్ మరియు వ్యర్థాల పారేసే పనులను రెసిడెన్షియల్ ఏరియాల్లో పూర్తిగా నిషేధించారు. పార్కులు, అడవులు, కొండలు, జలవనరులు, హెరిటేజ్ ప్రాంతాలలో ప్రకృతికి విఘాతం కలిగించే ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఉండదు. కనీసం 300 చదరపు మీటర్ల స్థలం ఉండి, 60 అడుగులు లేదా అంతకంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్డు పక్కన ఉండే ప్లాట్లలో, నిర్ణీత ఇంపాక్ట్ ఫీజు మరియుల్యాండ్-యూజ్ ఛార్జీలు చెల్లించి నిర్దేశిత నాన్-రెసిడెన్షియల్ పనులు చేసుకోవచ్చు. (ఈ వెసులుబాటు పార్కులు, రక్షిత జోన్లకు వర్తించదు). పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలకు లోబడి, తగిన బఫర్‌జోన్లు పాటిస్తూ వైట్, గ్రీన్ కేటగిరీ పరిశ్రమలను వ్యవసాయ జోన్లలో ఏర్పాటు చేసుకోవచ్చు. అగ్రికల్చర్ ల్యాండ్‌లో ఫార్మ్‌హౌస్ కట్టుకోవాలంటే కనీసం 0.50 ఎకరం స్థలం ఉండాలి. మొత్తం స్థలంలో నిర్మాణ విస్తీర్ణం 10 శాతానికి మించకూడదు. భవనం గరిష్టంగా +o1 అంతస్తులు, 11 మీటర్ల ఎత్తులోపు మాత్రమే ఉండాలి. రోడ్డు వెడల్పులు, పార్కింగ్, సెట్‌బ్యాక్‌లు, నదులు, కాలువలు, చెరువుల చుట్టూఉండే బఫర్ జోన్ల నిబంధనలు యథావిధిగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్, 2017 మరియు తదుపరి సవరణల ప్రకారమే అమలు అవుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## పోటీకి రెడీ అవుతున్న తోట

**గుంటూరు, జూలై 22, పెన్ పవర్:**

మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ తిరిగి యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన ఏ పార్టీలో చేరతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తోట చంద్రఖేశఖర్ బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు ఆ పార్టీలో దాదాపుగా లేరనే చెప్పాలి. తాజాగా తోట చంద్రశేఖర్ రెండు పార్టీల వైపు చూస్తున్నట్లు తెలిసింది. బీజేపీలో చేరడం, లేదా వైసీపీలో చేరడంపైనే ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. జనసేనలో చేరే అవకాశం లేకపోవడంతో ఇక ఈ రెండు పార్టీల్లో ఏదో ఒక దానిలో చేరి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే రెండుపార్టీల నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేద చిరంజీవితో సమావేశం తర్వాత... కొంత కాలం క్రితం మెగాస్టార్ చిరంజీవితో తోట చంద్రశేఖర్ సమాశమయ్యారు. తోట చంద్రశేఖర్ జనసేనలో చేరబోతున్నారన్నప్రచారం గత కొంత కాలంగా జరుగుతుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరతారని జోరుగా ఊహాగానాలు వచ్చాయి. అందుకేచిరంజీవిని కలిశారని అనుకున్నారు. కానీ జనసేన నుంచి ఆయనకు సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఆయన సొంత మీడియాలో కూడా జనసేనకు వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వైసీపీలేదా బీజేపీలో చేరతారని తాజాగా ఆయన అనుచరులు చెబుతున్నారు.... తోట చంద్రశేఖర్ కాపు సామాజికవర్గం కావడంతో వైసీపీ కూడా ఆయన చేరిక పట్ల కొంత సానుకూలతగా ఉన్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లాలోనే ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు. ఆ హామీ పార్టీ నాయకత్వం నుంచి లభిస్తే త్వరలోనే ఆయన చేరిక ఉంటుందని అంటున్నారు. గుంటూరుపశ్చిమ నియోజకవర్గంలో బలమైన నేత అవసరం తోట చంద్రశేఖర్ సామాజికవర్గం పరంగా, ఆర్థికంగా బలమైన నేత కావడంతో ఆయన చేరికకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని అంటున్నారు. త్వరలోనే తోట చంద్రశేఖర్ చేరిక ప్రకటన వస్తుందని, తద్వారా వైసీపీకి కూడా కాపు సామాజికవర్గం నుంచి మరికొంత బలం చేకూరుతుందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అయితే జగన్ దీనిపై ఫైనల్ డెసిషన్ తీసుకోవాల్సి ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మెదడు ఆరోగ్యం కీలకం... జీవనశైలితో పెరుగుతున్న ప్రమాదాలు

మన శరీరంలోని అన్ని పనులకు మెదడే ప్రధానంగా పనిచేస్తుంది. అది సరిగా పనిచేస్తేనే మనం ఏ పని అయినా చేయగలం. అయితే ప్రస్తుత ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, చెడు అలవాట్లు మన మెదడు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మెదడును ఎలా కాపాడుకోవాలి? ప్రతి ఏటా జులై 22న జరుపుకునే 'వరల్డ్ బ్రెయిన్ డే' ప్రాముఖ్యత ఏంటి? మెదడు యాక్టివ్‌గా ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం.
ాతీఠఅటఅఝ్రీ ×త్వశ్రీఅస్త్రవఅవి బంవం

**మన శరీరానికి 'మెదడే ప్రదానం :**
మనం నడవాలన్నా, మాట్లాడాలన్నా, ఆలోచించాలన్నా చివరకు కన్ను మూసి తెరవాలన్నా మెదడు ఇచ్చే సిగ్నల్స్ అత్యంత ముఖ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే శరీర అవయవాలన్నిటినీ నడిపించే కంట్రోల్ రూమ్ ఇది. ఇక మెదడు ఆరోగ్యంగా ఉంటేనే మన శరీరం సహకరిస్తుంది. కాబట్టి దానిని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత.

**జీవనశైలే పెద్ద శత్రువు:**
ప్రస్తుత కాలంలో మన అలవాట్లే మెదడుకు పెద్ద ప్రమాదకరంగా మారాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన వేళకు నిద్రపోకపోవడం, గంటల తరబడి స్మార్ట్‌ఫోన్లు చూడటం, జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడం వల్ల మెదడు పనితీరు మందగిస్తోంది. ఇక దీనివల్ల చిన్న వయసులోనే జ్ఞాపకశక్తి తగ్గడం డిప్రెషన్, పక్షవాతం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి.

**'వరల్డ్ బ్రెయిన్ డే' ఎందుకు జరుపుకుంటారు?:**
ప్రజల్లో మెదడు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా జులై 22న 'ప్రపంచ బ్రెయిన్ డే'గా నిర్వహిస్తారు. నాడీ సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని చెప్పడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

**మెదడును పదునుగా ఉంచే చిట్కాలు:**
పౌష్టికాహారం తీసుకోవాలి, ఆకుకూరలు, బాదం, వాల్‌నట్స్, పండ్లు తింటే మెదడుకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి. ఇక గాఢ నిద్ర ముఖ్యం రోజుకు కనీసం 7 నుండి 8 గంటల నిద్ర మెదడుకు ఎంతో విశ్రాంతిని ఇస్తుంది. అంతేకాక వ్యాయామం అవసరం. రోజూ వాకింగ్ లేదా యోగా చేయడం వల్ల మెదడుకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. ఇక మెదడుకు మేత పజిల్స్ పూరించడం, కొత్త విషయాలు నేర్చుకోవడం వల్ల మెదడు ఎల్లప్పుడూ చురుగ్గా ఉంటుంది.
గుండె ఎంత ముఖ్యమో.. మెదడు కూడా అంతే ముఖ్యం. కాబట్టి చిన్నపాటి జీవనశైలి మార్పులతో మన బ్రెయిన్‌ను సేఫ్‌గా ఉంచుకోవచ్చు. ఈ రోజే ఒక మంచి నిర్ణయం తీసుకోండి.. మీ మెదడును ఆరోగ్యంగా, చురుగ్గా ఉంచుకోండి.

# ప్రశ్నించే గొంతులు ఏమయ్యాయి?




నీట్ ప్రశ్నపత్రం లీక్, అనంతర పరిణామాలపై వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సీరియస్ కామెంట్లు చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ పై జాతీయస్థాయిలో నిరసనలు జరుగుతుంటే, మన ఏరియా (రాష్ట్రం)లో ఎందుకు అలాంటి నిరసనలు జరగడం లేదో తనకు అర్థం కావడం లేదంటూ కేతిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మన వాళ్లకు బెనిఫిట్ షోలపై చూపినంత ఉత్సాహం, నీట్, సీబీఎస్ఈ ప్రశ్నపత్రాల లీక్ అయినప్పుడు చూపించడం లేదంటూ విచారం వ్యక్తం చేశారు. నీట్ పై ప్రత్యేకంగా కేతిరెడ్డి మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నీట్ పరీక్షలపై కేతిరెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. కేవలం 30 సెకన్ల వీడియోలో ఆయన మాట్లాడిన మాటలు అందరినీ ఆలోచనకు గురిచేస్తున్నాయని అంటున్నారు. దీంతో కేతిరెడ్డి వీడియోను సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేస్తున్నారు. నేను మాట్లాడతాను, ప్రశ్నిస్తాను అన్నవారు కూడా ఈ విషయంలో ప్రశ్నించడం లేదని కేతిరెడ్డి ఆరోపించారు. బెనిఫిట్ షోలపై చూపుతున్న ఉత్సాహం పేపర్ లీకేజీలపై ఉండటం లేదని కేతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.
కాగా, కేతిరెడ్డి తన వీడియోలో ఏ రాజకీయ పార్టీ, నాయకుడి పేరు ప్రస్తావించకపోయినా, జాతీయ స్థాయి పరీక్షల వైఫల్యంపై ఉప ముఖ్యమంత్రి పవన్ మాట్లాడకపోవడాన్ని పరోక్షంగా నిలదీశారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. తప్పు జరిగితే ప్రశ్నిస్తానంటూ చెప్పే పవన్ మాటలను ఉటంకిస్తూ 'ప్రశ్నించే గొంతు' ఏమైందంటూ కేతిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించినట్లు భావిస్తున్నారు. కేతిరెడ్డి ఏ ఉద్దేశంతో వీడియో చేసినా, ప్రస్తుత పరిస్థితులకు తగినట్లు ఆయన మాట్లాడరని, అందుకే నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోందని అంటున్నారు.
నీట్ ప్రశ్నపత్రం లీకైన తర్వాత రీనీట్ నిర్వహించడం, దాని ఫలితాలు వెల్లడైనా 'కాక్రోచ్ పార్టీ' ఆందోళనలతో నీట్ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదని అంటున్నారు. అంతేకాకుండా గత రెండు రోజులుగా నీట్ లీకేజీనే జాతీయస్థాయిలో ప్రధాన చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. 20వ తేదీన నీట్ పరీక్ష వైఫల్యాన్ని నిరసిస్తూ కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించగా, 21న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నివాసం ఎదుట మెరుపు ధర్నా జరిగింది. దీంతో ప్రస్తుతం ఏ నోట విన్నా నీట్ పైనే చర్చ జరుగుతోంది.
అయితే జాతీయ స్థాయిలో విస్తృత చర్చ జరుగుతున్న ఈ అంశంపై రాష్ట్రంలో ఏ ఒక్కరూ మాట్లాడకపోవడాన్ని ఎత్తిచూపుతూ కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని అంటున్నారు. అయితే రాష్ట్రంలో అధికార పక్షంలోని ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించకపోవడం ఏంటంటూ కేతిరెడ్డి విమర్శలకు దిగితే, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని నెటిజన్లు ఎత్తిచూపుతున్నారు. ఏదిఏమైనా కేతిరెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు ఉండటంతో ఆయన ఒక్కసారిగా ట్రెండింగ్ లోకి వచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు.

## భారత్ గేట్లు ఓపెన్.. పాక్ పరిస్థితి కొట్టుకుపోవడమే..

జమ్మూ కాశ్మీర్‌లో వాన దేవుడు కరుణించడం కాదు... ఏకంగా విరుచుకుపడ్డాడు. ఎడతెరిపి లేని వర్షాలు, కొండచరియలు, ఫ్లాష్ ఫ్లడ్స్‌తో అటు అమర్‌నాథ్ యాత్రికులు, ఇటు వైష్ణోదేవి భక్తులు బేస్ క్యాంపులకే పరిమితమయ్యారు. వర్షం ఎంత గట్టిగా పడిందంటే... సలాల్, దుల్హస్తి, బగ్లిహార్ ప్రాజెక్టులు చూస్తుండగానే 'హౌస్‌ఫుల్' బోర్డులు తగిలించుకున్నాయి.
ఇక డ్యామ్ గేట్లు ఎత్తకపోతే నీళ్లు ఆనకట్టల పైనుంచి కాకుండా... అధికారుల ఆఫీసుల మీదుగా ప్రవహించేలా ఉన్నాయి. దాంతో వేరే దారి లేక అధికారులు గటగటా గేట్లన్నీ పైకెత్తేశారు. చీనాబ్ నది ఉప్పొంగిపోతోంది, తీర ప్రాంత ప్రజలకి హెచ్చరికలు జారీ అయ్యాయి.

**ఉగ్రవాదానికి నో.. కానీ నీళ్లకు యస్?**
ఇక్కడే ఉందండీ అసలు ట్విస్ట్.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పొరుగు దేశానికి "ఒక్క చుక్క నీరు కూడా ఇచ్చేదే లేదు, సింధు ఒప్పందాన్ని హోల్డ్‌లో పెడుతున్నాం" అని భారత్ గట్టిగానే చెప్పింది. కానీ ప్రకృతి దేవుడు మాత్రం.. "మీ రాజకీయం మీదే.. నా నీళ్లు నావే" అంటూ వర్షాన్ని కుమ్మేశాడు.
డ్యామ్‌లు పగిలిపోయే ప్రమాదం రావడంతో... భారత్ వద్దన్నా సరే ఆ అదనపు నీళ్లన్నీ సరదాగా పరుగులెడుతూ సరిహద్దు దాటి పాకిస్తాన్‌లోకి దూసుకెళ్తున్నాయి. ఒకప్పుడు చుక్క నీటి కోసం అంగలార్చే పొరుగు దేశానికి ఇప్పుడు ఒక్కసారిగా ఊహించని 'వాటర్ రైడ్' అనుభవం ఎదురవుతోంది. "అబ్బే! ఇదేదో ప్రేమతో ఉచితంగా పంపించిన నీళ్లు కాదండోయ్.. కేవలం మా డ్యామ్‌ల భద్రత కోసం ఎత్తిన గేట్లు అంతే!" అని భారత అధికారులు గొంతు చించుకుని మరీ చెప్తున్నారు.

**పాకిస్తాన్ పరిస్థితి.. "సంతోషించాలా? భయపడాలా?"**
1960 నాటి సింధు జలాల ఒప్పందం ప్రకారం చీనాబ్ నీళ్లు పాకిస్తాన్‌కు చాలా ముఖ్యం. కానీ ఇప్పుడు వస్తున్నది సాగునీరు కాదు... ఏకంగా ముంచెత్తే వరద నీరు.. "నీళ్లు వస్తున్నాయి కదా అని ఆనందించాలా? లేక ఈ ఫ్లాష్ ఫ్లడ్స్‌కి కొట్టుకుపోతామని భయపడాలా?" అని పాక్ అధికారులు తీవ్ర ఆలోచనలో పడిపోయారట.
మొత్తానికి జమ్మూ కాశ్మీర్‌లో కురుస్తున్న వర్షాలు మన భక్తులకు, ప్రజలకు కష్టాలు తెచ్చిపెడితే... వద్దనుకున్న పాకిస్తాన్‌కు మాత్రం వరద నీటిని ఫ్రీగా గిఫ్ట్‌గా పంపించేశాయి.

# ఏపీలో 43 లక్షల ఓట్లు ఔట్.. వైసీపీ సంచలన ఆరోపణలు



రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది.
రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు.
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది. కాగా, కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుండటంతోనే భారీగా ఓట్లను తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును ట్యాగ్ చేస్తూ వైసీపీ ట్వీట్ చేసింది. ప్రధానంగా గడువు పెంచిన తర్వాతే ఎక్కువగా ఓట్లను తొలగించారని ధ్వజమెత్తింది. తమ పార్టీకి పట్టున్న జిల్లాల్లో ఎక్కువ ఓట్లు డిలీట్ చేస్తున్నారని మండిపడింది. మొత్తానికి సర్ పై వైసీపీ చేసిన ఆరోపణలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 45 రోజులుగా సర్ ప్రక్రియ కొనసాగుతోంది. అధికార కూటమి నేతలతోపాటు విపక్ష నేతలు తమ ఓటర్లను కాపాడుకోడానికి విశ్వప్రయత్నాలు చేశారని చెబుతున్నారు. అయితే సరైన ఆధారాలు లేకపోవడం, ఓటర్ల ఆచూకీ లేకపోవడం వల్ల దాదాపు 44 లక్షల వరకు ఓట్లు తొలగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో డబుల్ ఎంట్రీలు, డెత్ ఓట్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో రచ్చకు ముగింపు.. కానీ, అలా జరగదు ఎందుకంటే?



నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం జాతీయస్థాయిలో తీవ్ర రచ్చకు దారితీస్తోంది. పేపర్ లీక్ తర్వాత ఈ విషయమై ఆందోళనలు చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తల నుంచి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వరకు అంతా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు మూడు నెలలుగా నిరసనకారులు కేంద్ర మంత్రి రాజీనామాకు పట్టుబడుతున్నా కేంద్రం మాత్రం ఇంతవరకు కనీసం పట్టించుకోవడం లేదనే అంటున్నారు. ఇక గత రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలతో పేపర్ లీక్ ఉదంతంపై చర్చకు కేంద్రం అంగీకరించినా, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశాన్ని మాత్రం నిర్దాక్షిణ్యంగా తోసిపుచ్చుతోంది. దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెనకేసుకు రావడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. 12 ఏళ్ల ఎన్డీఏ పాలనలో ఎన్నడూ లేనట్లు నీట్ పేపర్ లీక్ వివాదం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. గతంలో కూడా జాతీయస్థాయిలో అనేక వివాదాలు చెలరేగినా, అవన్నీ టీ కప్పులో తుఫాన్ లా చప్పున చల్లారిపోయేవి. కానీ ఈ సారి ఉద్యమంలో యువత స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావడమే రచ్చకు దారితీస్తోందని అంటున్నారు. అదే సమయంలో నీట్ ప్రశ్నపత్రాల లీక్ నే అజెండాగా పుట్టుకొచ్చిన కాక్రోచ్ పార్టీ తొలి నుంచి మంత్రి ధర్మంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తోంది. ఇక సోమవారం నిర్వహించిన పార్లమెంటు మార్చ్ లో తమ నిరసన స్వరం మరింత గట్టిగా వినిపించడంతోపాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వివాదంపై సీరియస్ గా ఫోకస్ చేయడంతో పరిస్థితులు మరింత జటిలమయ్యేలా కనిపిస్తున్నాయని అంటున్నారు. అయితే పరిస్థితి ఎంతలా మారినా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రక్షించుకోవాలనే ఏకైక నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండటంతో వివాదం రాజకీయంగా ముదురుతోందని అంటున్నారు. విద్యార్థులు, ప్రతిపక్ష నేతలు ముక్త కంఠంతో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆ ఒక్కటి తప్ప, అన్నట్లే వ్యవహరిస్తోందని అంటున్నారు. మూడు నెలల తర్వాత ఈ వివాదంపై కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం మొదలు పెట్టగా, విపక్షం ఒత్తిడితో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చకు సైతం అంగీకరించిందని చెబుతున్నారు. కానీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం విపక్షాల ఒత్తిడికి తలొగ్గకూడదని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. ఇందుకు రాజకీయ, వ్యవస్థాపరమైన కారణాలు ఉన్నాయని అంటున్నారు.విపక్షాలు, నిరసనకారుల ఒత్తిడి మేరకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయిస్తే, అది ఆత్మాహత్యాసదృశ్యమే అవుతుందని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. ప్రధానంగా ఒకరి రాజీనామాతో విఫలమైన వ్యవస్థలకు మంత్రులే బాధ్యులనే సంప్రదాయానికి తెరతీసినట్లు అవుతుందని భావిస్తున్నారని అంటున్నారు. ఇది భవిష్యత్తులో ఇతర సీనియర్ మంత్రులపై ఒత్తిడి పెంచడమే కాకుండా, విపక్షాలకు ఒక అస్త్రం అవుతుందనే ఆందోళన కేంద్ర పెద్దల్లో ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో మంత్రి తప్పుకుంటే అది ప్రభుత్వానికి బలహీనతగా మారుతుందని అంటున్నారు. అందుకే మంత్రి రాజీనామా కన్నా వ్యవస్థాగత ప్రక్షాళన ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని అభిప్రాయపడుతున్నారని అంటున్నారు.
మరోవైపు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమర్థత కూడా పార్టీని ప్రభుత్వ పెద్దలను కట్టిపడేస్తుందని అంటున్నారు. ఒడిశాకు చెందిన ధర్మేంద్ర ప్రధాన్ కు ఆర్ఎస్ఎస్ తో విస్తృత అనుబంధం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఒడిశాలో దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు పాలించిన బిజూ జనతాదళ్ ను ఓడించేలా ధర్మేంద్ర ప్రధాన్ చాలా కృషి చేశారని గుర్తింపు దక్కించుకున్నారు. మొట్టమొదటిసారిగా ఒడిశాలో బీజేపీని అధికారంలోకి తేవడంలో ధర్మేంద్ర ప్రధాన్ వ్యూహాలు అత్యంత కీలకంగా చెబుతున్నారు. దీంతో ఆయనను మంత్రివర్గం నుంచి తప్పిస్తే సమర్థులైన నేతలను రక్షించలేని స్థితిలో ప్రభుత్వం ఉందనే అపవాదును మూటగట్టుకునే ప్రమాదం ఉందని కేంద్రం భయపడుతున్నట్లు చెబుతున్నారు. అదేసమయంలో జాతీయ విద్యావిధానం-2020 ద్వారా వ్యవస్థను పటిష్టం చేసిన మంత్రిని రాజకీయాల కోసం బలిచేయకూడదనే అభిప్రాయం కూడా ఆయనకు శ్రీరామ రక్షగా మారిందని అంటున్నారు.

# కుట్ర జరుగుతోందా?

ఉన్నది ఉన్నట్లుగా.. జరుగుతున్నది జరుగుతున్నట్లుగా చెప్పటం మీడియా సంస్థలకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణం. ప్రత్యేక కథనాల్లో ఎలాంటి పైత్యాల్ని ప్రదర్శించినా ఆ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ.. జరుగుతున్న ఒక పరిణామం గురించి రిపోర్టింగ్ చేసేటప్పుడు.. సదరు ఉదంతంలో ఏం జరిగింది? ఎక్కడ జరిగింది? ఏం జరుగుతోంది? లాంటి ప్రాథమిక ప్రశ్నలకు సమాధానంగా సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంది. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ.. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన అంశాన్నే తీసుకుందాం. ఇదో భారతీయ వ్యంగ్య రాజకీయ ఉద్యమన్న విషయం అందరికి తెలిసిందే.
తాజాగా దేశ రాజధానిలో నిర్వహిస్తున్న నిరసనలు.. ఆందోళనలు మొత్తం నీట్ పరీక్ష లీకేజీ.. దానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. అదే సమయంలో సోనమ్ వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేపట్టటం..ఆయన ఆరోగ్యం అంతకంతకూ క్షీణించటం.. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావటం.. కేంద్రం స్పందించాలని కోరటం తెలిసిందే. ఆయన ఆరోగ్యం పెద్ద ఎత్తున క్షీణిస్తున్న వేళ.. ఆయన్ను బలవంతంగా ఆసుపత్రికి తరలించే వేళ.. పోలీసులు అక్కడి నిరసనకారులపై పెద్ద ఎత్తున బలప్రయోగం చేయటం.. ఈ సందర్భంగా చేపట్టిన లాఠీ ఛార్జ్ లో ఎప్పటిలానే పోలీసుల ఓవరాక్షన్ కనిపించింది.
కట్ చేస్తే.. జరిగింది ఇదైతే.. ఇప్పుడు జరుగుతున్నది.. ఈ ఆందోళనలు.. నిరసనల మీద విదేశీ మీడియా సంస్థలు తమ అంతర్జాతీయ పాఠకుల కోసం అందిస్తున్న వార్తలు ఎలా ఉన్నాయా? తమ వార్తల్ని ఎలా చెబుతున్నాయి? అందులోని అంశాలు ఏమేం ఉంటున్నాయి? వారు అందిస్తున్న వార్తలు.. కథనాల్లో వాస్తవాలు ఎన్ని? వాస్తవాలకు భిన్నమైన అంశాలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయాన్ని తరచి చూస్తే షాక్ తినాల్సిందే. ఎందుకంటే.. అర్థసత్యాలు.. విషయాల్ని కలగాపులగం చేస్తూ అసలు విషయాన్ని పక్కన పెట్టేసి.. తమ ఎజెండాను వార్తల రూపంలో వండి వారుస్తున్న తీరు చూస్తే.. ఇదంతా ఏమైనా ఒక కుట్ర? అన్న సందేహం రాక మానదు. భారతదేశం మీద ఏదైనా వ్యూహాత్మకంగా దాడి జరుగుతుందా? అన్న సందేహం కలుగక మానదు.
ఇప్పటివరకు దీన్ని చదువుతున్న వారంతా.. మోడీకి అనుకూలంగా ఈ కథనం ఉందన్న భావనకు రావొచ్చు. కానీ.. ఇక్కడ మోడీ విధానాల్ని మేం సమర్థించటం లేదు. ఆందోళకారులపై జరిగిన లాఠీ ఛార్జ్ తప్పు కాదని చెప్పటం లేదు. సోనమ్ వాంగ్ చుక్ నిరసనకు ముందే మోడీ సర్కారు స్పందించి ఉంటే బాగుండేదన్న భావన మాకుంది. ఇదంతా ఎందుకంటే.. ఇప్పుడు పక్షపాత ధోరణితో వార్తల్ని అందిస్తూ.. తప్పుడు ప్రచారాలు చేసే వారి జట్టులో మేం కలవాలని అనుకోవటం లేదు. ముందే చెప్పినట్లు.. ఉన్నది ఉన్నట్లుగా.. జరుగుతున్నది జరుగుతున్నట్లుగా చెప్పటమే ఈ కథనం ఉద్దేశం.అందుకు తగ్గట్లే.. వాస్తవాల్ని మాత్రమే మీకు అందించాలన్నది మా ఉద్దేశం. ఎందుకంటే.. తప్పుడు సమాచారాన్ని చేరవేసే ఎంత పెద్ద సంస్థ అయినా.. తప్పుడు అభిప్రాయాలు పెరిగి పెద్దయ్యేలా జరిగే కుట్రల్ని దేశ ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మా మీద ఉంది. ఇక్కడో సున్నటి గీత ఒకటి ఉంది. అది మోడీ సర్కారుకు అనుకూలంగా వాదనలు వినిపించటం.. వాస్తవాల్నిమాత్రమే పాఠకులకు చెప్పటం. మేం రెండో అంశాన్ని ప్రాతిపదికన విషయాల్ని.. వివరాల్ని అందించాలని భావిస్తున్నాం. అందుకే.. ఆధారాల సహా మీ ముందు ఉంచుతున్నాం.
పలు విదేశీ మీడియా సంస్థలు తమ హెడ్ లైన్ లో మాత్రం భారత విద్యార్థుల నిరసనలు.. మోడీ సంకీర్ణ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి అని పేర్కొంటూ.. సదరు కథనంలో మాత్రం జరుగుతున్న విషయాల్ని కలగాపులగం చేస్తూ.. ప్రధాని నరేంద్ర మోడీని రాజీనామా చేయాలన్న డిమాండ్ పై ఆందోళనలు జరుగుతున్న అభిప్రాయం కలిగేలా వార్తలు ఉండటం గమనార్హం.
అల్ జజీరా టీవీ రిపోర్టింగ్ కు సంబంధించి చూస్తే.. ఢిల్లీ వీధుల్లో వేలాది మంది విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చిన విజువల్స్ ను చూపిస్తూ.. దాని బ్యాక్ గ్రౌండ్ వాయిస్ లోనూ.. హెడ్ లైన్స్ లోనూ ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా కోసం వేలాది మంది విద్యార్థుల నిరసన అంటూ ప్రసారం చేయటంలో ఉద్దేశం ఏంటి? నిజానికి మంగళవారం మధ్యాహ్నం తర్వాతనే కాంగ్రెస్ ఈ అంశంపై నిరసనలు చేపడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయటం తెలిసిందే. దానిని.. వెంటనే తాను ప్రసారం చేసే వార్తల్లో నిరసన చేపట్టే విద్యార్థుల డిమాండ్ గా చెప్పటం దేనికి నిదర్శనం?బ్రిటన్ కు చెందిన బీబీసీ విషయాన్నే తీసుకుందాం. అంతర్జాతీయంగా ఈ మీడియా సంస్థకు ఉన్న విశ్వసనీయతను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆచితూచి వార్తల్ని ఇస్తుందన్న పేరున్న ఈ మీడియా సంస్థ.. తాజా ఉదంతాన్ని ఎలా చూపిస్తుందన్న విషయంలోకి వెళితే.. 'భారత పరీక్షల కుంభకోణం విస్తృత నిరసనలకు, రాజకీయ సంక్షోభానికి దారి తీసింది' అని పేర్కొంటూ.. తన రిపోర్టింగ్ లో మాత్రం.. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు.. పోలీసుల లాఠీ ఛార్జ్ ను చూపిస్తూ.. భారతదేశంలోని మొత్తం నిరుద్యోగ సంక్షోభం..వ్యవస్థాగత వైఫల్యంగా జనరలైజ్ చేయటం ద్వారా వాస్తవాల్ని వక్రీకరించే ప్రయత్నం జరిగిందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. గార్డియన్ లాంటి మీడియా సంస్థలకు చెందిన కొన్ని కథనాల్లో భారతదేశంలో ప్రజాస్వామ్య అణిచివేతగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది.
ఇంతేనా.. ఇంతకు మించి చాలానే జరుగుతున్నది. ఒక విదేశీ మీడియా అనుబంధ ఇన్ స్టా హ్యాండిల్ లో విచిత్రమైన కథనం ఒకటి ప్రసారమై.. వైరల్ అయ్యింది. దాని సారాంశం..కాక్రోచ్ మూవ్ మెంట్ నిరసనకారులపై బ్లడీ క్రాక్ డౌన్ (అంటే రక్తపాతం) చేయాల్సిందిగా హోం మంత్రి అమిత్ షా .. ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా ఆదేశించారన్న దుర్మార్గమైన నెరేషన్ ను అసోసియేటెడ్ ప్రెస్ పేరును తప్పుగా కోట్ చేస్తూ.. ఆ సంస్థకు ఉన్న విశ్వసనీయతను వాడుకుంటూ తన దుర్మార్గమైన ఎజెండాతో రాసేసిన వైనం చూస్తే.. బరితెగింపు ఎంతగా ఉందన్న విషయం ఇట్టే అర్థమయ్యేలా చేస్తుంది. వాస్తవానికి అలాంటి ఆదేశాలు ఏవీ లేవన్న విషయం తెలిసిందే.

## సంపాదకీయం

# దాతృత్వ స్వావలంబన!

గత దశాబ్ద కాలంలో భారత దాతృత్వ రంగం అనూహ్యంగా మారింది. విదేశీ విరాళాలపై ఆధారపడిన కాలంనుంచి, స్వదేశీ కుటుంబ దాతృత్వం, కార్పొరేట్ సామాజిక బాధ్యత, వ్యక్తిగత విరాళాలు ప్రధాన శక్తిగా మారే దశకు దేశం చేరుకుంది. నేడు దేశీయ దాతృత్వం వార్షిక విదేశీ విరాళాల కంటే ఎన్నో రెట్లు అధికంగా ఉంది. మ్యూచువల్ ఫండ్స్, సిప్‌లు, యూపీఐ ద్వారా కోట్లాది భారతీయులు ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతున్న నేపథ్యంలో, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) చుట్టూ నడుస్తున్న చర్చను కేవలం విదేశీ నిధుల వివాదంగా కాక, భారత్ స్వావలంబన దాతృత్వంవైపు వేస్తున్న అడుగుగా చూడాలి. బహిరంగ జీవితాన్ని ప్రభావితం చేసే సంస్థల్లోకి ప్రవహించే విదేశీ మూలధనాన్ని నియంత్రించే హక్కు, బాధ్యత ప్రతి సార్వభౌమ దేశానికీ ఉంటుంది. ఇది భారత్‌కు మాత్రమే పరిమితమైనది కాదు, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనదీ కాదు. అమెరికా ఫారా చట్టం కింద పారదర్శకతను తప్పనిసరి చేస్తుంది, ఆస్ట్రేలియా, పలు యూరోపియన్ దేశాలు కూడా ఇలాంటి నియంత్రణ వ్యవస్థలనే అమలు చేస్తున్నాయి. కాబట్టి చర్చించాల్సింది విదేశీ నిధులను నియంత్రించాలా? వద్దా? అన్నది కాదు, ఆ నియంత్రణ ఎంత సమతూకంగా, సమర్థంగా అమలవుతోందన్నదే అసలు ప్రశ్న. వాస్తవానికి, ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలు కఠినతరం కావడంవల్ల భారత అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్న అభిప్రాయం బలంగా ఉన్నా, లెక్కలు మరో మాట చెబుతున్నాయి. నీతి ఆయోగ్ ఎన్జీవో దర్పణ్ పోర్టల్‌లో సుమారు ఆరు లక్షల స్వచ్ఛంద సంస్థలు నమోదై ఉండగా, వాటిలో 14,500 సంస్థలకు మాత్రమే యాక్టివ్ ఎఫ్‌సీఆర్‌ఏ నమోదు ఉంది. అయినప్పటికీ గత దశాబ్దంలో విదేశీ విరాళాలు రెట్టింపయ్యాయి. పది వేల కోట్లనుంచి దాదాపు రూ.22 వేల కోట్లకు చేరాయి. అంటే, స్వచ్ఛంద రంగం విదేశీ నిధుల కొరతతో అలమటించలేదన్నది స్పష్టం.

అసలైన మార్పు దేశీయ దాతృత్వంలోనే కనిపిస్తోంది. బెయిన్–దాస్రా ఇండియా ఫిలాంత్రోపీ రిపోర్ట్ 2026 ప్రకారం, దేశీయ ప్రైవేటు దాతృత్వం ఏటా రూ.1.18 లక్షల కోట్లకు పైగా చేరింది. విదేశీ విరాళాలకంటే ఐదు రెట్లు ఎక్కువ. కొత్తతరం సంపన్నులు తమ సంపదను సమాజానికి తిరిగి ఇవ్వడాన్ని 'వెల్త్ స్టీవార్డ్‌షిప్'లో భాగంగా చూస్తుంటే, కుటుంబ దాతృత్వం రెండంకెల వృద్ధి రేటుతో విస్తరిస్తోంది.

దీంతో భారత దాతృత్వ కేంద్రబిందువు నిశ్శబ్దంగా స్వదేశానికి మళ్లింది. అయితే, ఈ పరివర్తన కాలంలో కొన్ని సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్న వాస్తవాన్ని విస్మరించలేం. నమోదు పునరుద్ధరణల్లో జాప్యం, సుదీర్ఘ ప్రాసెసింగ్ సమయం, కొన్ని సందర్భాల్లో నమోదు రద్దు వంటి కారణాలతో విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, గ్రామీణాభివృద్ధి రంగాల్లో పనిచేస్తున్న సంస్థల కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఇది మొత్తం రంగానికి వర్తించే విషయం కాకపోయినా, ప్రభావితమైన సంస్థల కష్టాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ పరివర్తన సందర్భంగా రంగంలోని అసమాన సంసిద్ధత కూడా బయటపడింది. కొన్ని సంస్థలు ఆదర్శవంతమైన పాలనా ప్రమాణాలతో పనిచేస్తుండగా, మరికొన్ని నిర్లిప్తంగా మారాయి లేదా వాటి డాక్యుమెంటేషన్ ప్రమాణాలు పెరుగుతున్న అంచనాలకు తగ్గట్టుగా ఎదగలేదు. గత మూడు దశాబ్దాల్లో భారత కార్పొరేట్ రంగం ఇలాంటి పరిణామాన్నే ఎదుర్కొంది.

మొదట్లో కఠినమైన గవర్నెన్స్ ప్రమాణాలు భారంగా అనిపించినా, చివరికి అవే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొన్నాయి. సామాజిక రంగం కూడా అదే బాటలో నడవగలదు. దాతృత్వానికి ధనం ఇంధనమైతే, విశ్వాసమే దాని కరెన్సీ. నియంత్రణ లక్ష్యం మరింత కఠినంగా మార్చడం కాదు, మెరుగ్గా మార్చడం అయివుండాలి. పరిపాలనాపరమైన చిన్న పొరపాటుకు, మోసానికి ఒకే శిక్ష విధించకూడదు. లోపాలను ఎత్తిచూపే నోటీసులు, సరిదిద్దుకోవడానికి నిర్దిష్ట గడువులు, స్వతంత్ర అప్పీలేట్ వ్యవస్థ వంటి నిర్మాణాత్మక ప్రక్రియ ద్వారా చట్టం లక్ష్యాన్ని కాపాడుకుంటూనే, నిజాయితీగా పనిచేసే సంస్థలకు అనవసర ఇబ్బందులు తప్పించవచ్చు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్‌సీఆర్‌ఏ 2.0 వేదిక ఇందుకు నిజమైన అవకాశాన్ని కల్పిస్తోంది.

అయితే ఎఫ్‌సీఆర్‌ఏ పరిపాలనను సరిదిద్దడం సమస్యలో సగం మాత్రమే పరిష్కరిస్తుంది. అసలైన లక్ష్యం 'ఆత్మనిర్భర' దాతృత్వ వ్యవస్థను నిర్మించడం. దాతృత్వాన్ని జాతీయ ప్రాధాన్యతగా చాటిచెప్పే విధంగా భారత పన్ను వ్యవస్థ ఇంకా రూపొందలేదు. సెక్షన్ 80జీ కింద మినహాయింపులు సాధారణంగా విరాళంలో సగానికే పరిమితం. సింగపూర్ 250 శాతం మినహాయింపు ఇస్తుండగా, బ్రిటన్, అమెరికా కూడా తమ దాతలకు ప్రోత్సాహకాలిస్తున్నాయి. భారత్ వీటిని యథాతథంగా అనుకరించాల్సిన అవసరం లేదు, కానీ 80జీ మినహాయింపును 100 శాతానికి పెంచడం, గరిష్ఠ పరిమితిని 25 శాతానికి పెంచడం ఖజానాపై పెద్దగా భారం పడకుండానే దీర్ఘకాలిక సామాజిక మూలధన ప్రవాహాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. మొదటి తరం వ్యాపారవేత్తలు తమ సంపదను ఎక్కువగా ఈక్విటీ రూపంలో కలిగి ఉంటారు కాబట్టి, తగిన రక్షణ చర్యలతో లిస్టెడ్ షేర్ల రూపంలో విరాళాలిచ్చే విధానం దేశీయ దాతృత్వ మూలధనాన్ని వెలికితీసే శక్తిమంతమైన మార్గంగా మారగలదు. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే, 22 కోట్లకు పైగా డీమ్యాట్ ఖాతాలు, విస్తృత సిప్ పెట్టుబడులు, ప్రతి జేబులోనూ యూపీఐ అందుబాటులో ఉన్న నేపథ్యంలో, సామూహిక భాగస్వామ్యానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. విశ్వసనీయమైన డిజిటల్ వేదికల ద్వారా నెలకు కొద్ది మొత్తమైనా విరాళమిచ్చినా, కోట్లాది పౌరులు దేశ సామాజిక సమస్యల పరిష్కారంలో చురుకైన భాగస్వాములవుతారు. సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, భారత ఆర్థిక మార్కెట్లు మూలధనం కోసం చేసిన పనినే సామాజిక మూలధనం కోసం చేయగలదు. భారత పౌరులు, సంస్థలు తమ దేశ సామాజిక సమస్యలకు తామే నిధులు సమకూర్చినప్పుడు, మూలధనంతో పాటు గవర్నెన్స్, ఆలోచనలు, జవాబుదారీతనం కూడా సాధ్యం. పరిశోధన, ఆవిష్కరణల వంటి రంగాల్లో విదేశీ దాతృత్వం ఇకపైనా కీలకంగానే ఉంటుంది, కానీ భారత్ అభివృద్ధి చెందిన దేశ హోదావైపు అడుగులు వేస్తున్న తరుణంలో అది పూరకంగా మాత్రమే ఉండాలి. చివరిగా, లక్ష్యం కేవలం విదేశీ దాతృత్వాన్ని సమర్థంగా నియంత్రించడం మాత్రమే కాదు –సామాజిక పరివర్తనలో అత్యధిక భాగం భారతీయులే నిధులు సమకూర్చి, నడిపించి, సొంతం చేసుకునే దేశాన్ని నిర్మించడం. అదే ఆత్మనిర్భర దాతృత్వ వ్యవస్థ వాగ్దానం!!

---

## పనికొచ్చే పలుకు



# అదీ.. అసలైన సార్థక జీవనం

"జీవిత పరమార్థం కేవలం సంతోషంగా ఉండటం మాత్రమే కాదు, ఇతరులకు ఉపయోగపడటం, గౌరవంగా బతకడం, కరుణ కలిగి ఉండటమే నిజమైన జీవితం"

మనిషి పుట్టినప్పటి నుంచి వెంటాడే ఒకే ఒక్క ఆరాటం –సంతోషం. చదువు, ఉద్యోగం, డబ్బు, పేరు ప్రతిష్ఠలు –వీటన్నింటి వెనుక అంతిమ లక్ష్యం ఆనందంగా ఉండటమేనని అనుకుంటాం. కానీ ఆధునిక జీవన విధానం నేర్పిన ఒక పెద్ద అపోహ –సంతోషమే జీవిత పరమార్థం అనుకోవడం. వాస్తవానికి, కేవలం సంతోషం కోసం పరుగెత్తే మనిషి, ఆ సంతోషాన్ని ఎప్పటికీ పూర్తిగా అందుకోలేడు. ఎందుకంటే సంతోషం అనేది ఒక తాత్కాలిక భావన, ఒక క్షణికమైన అనుభూతి. దాన్ని వెంటాడితే అది మరింత దూరం జరుగుతుంది. అదే సమయంలో, ఇతరులకు ఉపయోగపడటం, గౌరవంగా జీవించడం, హృదయంలో కరుణను నింపుకోవడం –ఇవి శాశ్వతమైన సంతృప్తిని ఇచ్చే మూలాలు.

నేటి జీవనశైలిని పరిశీలిస్తే, మనం ఎంత బిజీగా ఉన్నా, ఎంత సంపాదిస్తున్నా, లోలోపల ఒక వెలితి కనిపిస్తుంది. దీనికి కారణం మనం జీవితాన్ని కేవలం 'నా కోసం' అనే కోణంలో మాత్రమే చూడటం. ఉద్యోగంలో ఎదగాలి, ఇల్లు కొనాలి, కారు కొనాలి, పేరు తెచ్చుకోవాలి –ఇవన్నీ వ్యక్తిగత లక్ష్యాలే. ఇవి తప్పు కాదు, కానీ ఇవే జీవితం మొత్తం అయితే, మనిషి లోపల ఒంటరితనం ఏర్పడుతుంది. ఎందుకంటే మనిషి సామాజిక జీవి. అతని మనసుకు నిజమైన శాంతి లభించేది, తనకోసం తాను బతికినప్పుడు కాదు.. మరొకరి జీవితంలో వెలుగు నింపినప్పుడు. ఒక చిన్న సాయం, ఒక ఓదార్పు మాట, ఒక నిస్వార్థ చేయూత –ఇవి ఇచ్చే తృప్తి, ఎంత సంపాదించినా రావు.

గౌరవంగా బతకడం అంటే కేవలం సమాజంలో గుర్తింపు పొందడం కాదు. తనను తాను గౌరవించుకుంటూ, ఇతరులను గౌరవిస్తూ, నిజాయితీగా, నిబద్ధతతో జీవించడం. ఈ రోజుల్లో విజయం సాధించడానికి షార్ట్‌కట్‌లు వెతికే ధోరణి పెరుగుతోంది. కానీ ఏ మార్గంలో సాధించినా, అది గౌరవప్రదంగా లేకపోతే, ఆ విజయం లోపల ఖాళీగానే మిగిలిపోతుంది. మనం చేసే పనిలో నిజాయితీ ఉన్నప్పుడు, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నప్పుడు, ఎదుటివారిని మోసం చేయకుండా బతికినప్పుడు మాత్రమే, రాత్రి పడుకునే ముందు మనసు ప్రశాంతంగా ఉంటుంది.

ఇక కరుణ –ఇది మనిషిని మనిషిగా నిలబెట్టే అసలైన లక్షణం. పోటీ ప్రపంచంలో, అందరూ తమ లక్ష్యాల వైపే పరుగెడుతున్న వేళ, ఆగి ఒకసారి పక్కవారి బాధను అర్థం చేసుకోవడం, వారి స్థానంలో నిలబడి ఆలోచించడం అరుదైన గుణంగా మారిపోయింది. అయితే ఇదే గుణం మనిషి జీవితానికి నిజమైన అర్థాన్ని ఇస్తుంది. ఒక వృద్ధురాలికి రోడ్డు దాటించడం, ఒక అపరిచితుడికి దారి చూపడం, కష్టాల్లో ఉన్న స్నేహితుడికి ఓదార్పుగా నిలవడం –ఇలాంటి చిన్న చిన్న కరుణ చర్యలే, జీవితాన్ని అర్థవంతం చేస్తాయి.

కాబట్టి, జీవితాన్ని కేవలం సంతోషం వెతుక్కునే ప్రయాణంగా కాక, సేవ, గౌరవం, కరుణ కలబోసిన ఒక అర్థవంతమైన ప్రయాణంగా మలచుకోవాలి. అప్పుడు సంతోషం మనం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు – అది దానంతటదే మన వెంట నడుస్తుంది.

---

# ..వేచిచూస్తున్న యవ్వనం!?

భారత సంతానోత్పత్తి రేటు రెండుకు స్థిరపడింది. –ఇది సంక్షోభం కాదు, ఎంపిక స్వేచ్ఛ సాధించిన ఫలితం. యువత కుటుంబాన్ని వద్దనుకోవడం లేదు, తగిన పరిస్థితుల కోసం వేచిచూస్తున్నారు. డబ్బు, గృహవసతి, ఉద్యోగ భద్రత –వారి సందేహాలన్నీ ఆచరణాత్మకమైనవే. సంరక్షణ భారం మహిళలపైనే ఎక్కువ, అందుకే కెరీర్–కుటుంబం మధ్య నిత్య పోరాటం. 25.5 కోట్ల యువ భారతం ముందు ఇప్పుడు ఒకే ప్రశ్న –ఈ అవకాశపు కిటికీని అందుకోగలమా?



భారతదేశంలో ఒక అమ్మమ్మను –తనకాలం నుంచి ఇప్పటికి ఏం మారిందని చెప్పమంటే, ఆమె సంతానోత్పత్తి గురించి మాట్లాడదు. కళాశాల చదువు పూర్తి చేసి, నగరంలో ఉద్యోగం సంపాదించి, కుటుంబం ప్రారంభించడానికి తొందరపడని తన మనవరాలి గురించి చెబుతుంది. అందులో గర్వం, ఆందోళన రెండూ కలగలిపి ఉంటాయి. గణాంకాలు కూడా ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవం (జులై 11) సందర్భంగా, ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్‌ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'డెమోగ్రాఫిక్ ఫ్యూచర్స్ సర్వే' 73 దేశాల్లో లక్షకు పైగా యువతను సర్వే చేసిన అతిపెద్ద అధ్యయనం. యువత భాగస్వామ్యాన్ని, కుటుంబాన్ని కోరుకుంటున్నారా? లేదా? అన్నది కాదు, వారికి, ఆ లక్ష్యానికి మధ్య అడ్డంకులు ఏమిటని సర్వే ప్రశ్నించింది. ఈ ఏడాది భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 'గర్భధారణల సమయ నిర్ధారణ, అంతరం' (హెచ్‌టీఎస్‌పీ) అనే థీమ్‌ను ఎంచుకోవడం గమనార్హం. ప్రతి జనాభా గణాంకం వెనుక ఉండేది ఎంపిక స్వేచ్ఛేనన్న వాస్తవాన్ని ఇది గుర్తుచేస్తుంది. భారత సంతానోత్పత్తి రేటు మహిళకు ఇద్దరు పిల్లలకు స్థిరపడింది. ఇది భర్తీస్థాయి 2.1 కంటే తక్కువ. కొందరు దీన్ని 'జననాల క్షీణత' లేదా 'జనాభా సంక్షోభం'గా అభివర్ణించవచ్చు. కానీ యూఎన్‌ఎఫ్‌పీఏ దృష్టిలో ఇది ఆందోళనకరమైన సంకేతం కాదు, బాలికల విద్య, జాతీయ ఆరోగ్య మిషన్, గర్భనిరోధక ఎంపికలు, ప్రసూతి ఆరోగ్య సేవల విస్తరణలో దశాబ్దాలుగా ప్రభుత్వం చేసిన నిరంతర పెట్టుబడికి ఫలితం. 18 ఏళ్లలోపే వివాహమైన యువతుల వాటా గత కొన్నేళ్లలో 23.3 శాతంనుంచి 20.1 శాతానికి తగ్గింది. ఇది భారత సంస్థలు గర్వించదగ్గ విధాన విజయం.

అయితే గణాంకాలు ఒకేసారి ఎన్నో కథలు చెబుతాయి. మంచి కథ దగ్గరే ఆగిపోతే, యువ భారతం చెప్పదలచుకున్నది వినిపించకుండా పోతుంది. యువతను నేరుగా అడిగితే, వారిలో చాలామంది తమ ముందు తరాలు కోరుకున్నదే కోరుకుంటున్నారు. దేశవ్యాప్తంగా పదిమంది మహిళల్లో నలుగురు, ముగ్గురు పురుషుల్లో ఒకరు ఇద్దరు పిల్లలే తమ ఆదర్శ కుటుంబ పరిమాణమని అంటున్నారు. వేర్వేరు దేశాల్లో కూడా ఇదే సర్వే ఇలాంటి పోకడనే గుర్తించింది. యువత కుటుంబ జీవితం నుంచి వెనుదిరగడం లేదు, దాన్ని నిర్మించుకునేందుకు తగిన పరిస్థితులు ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్నారు. మరి ఇక్కడ ఈ సంకోచం ఎందుకు? యువ దంపతులను వారికి, వారు ఊహించుకునే జీవితానికి మధ్య అడ్డంకి ఏమిటని అడిగితే, సమాధానాలు దాదాపు ఆచరణాత్మకంగానే ఉంటాయి. పదిమందిలో నలుగురు ముందుగా డబ్బు సమస్యనే ప్రస్తావిస్తారు. తర్వాత గృహవసతి, ఉద్యోగ భద్రత సమస్యలు. ఆఖరున, 'మన పిల్లలను ఎంత బాగా చూసుకోగలం' అనే సాదాసీదా, మానవీయమైన ఆందోళన కూడా వ్యక్తమవుతుంది. ఈ చివరి ప్రశ్న భారం ఒక వర్గంపైనే ఎక్కువగా పడుతోంది. భారతదేశంలో యువతులు రోజుకు ఐదు గంటలకు పైగా వేతనరహిత గృహకృత్యాలు, సంరక్షణ పనుల్లో గడుపుతుండగా, యువకులు కేవలం అరగంట మాత్రమే వెచ్చిస్తున్నారు. ప్రతి వందమంది యువతుల్లో 15మంది మాత్రమే వేతన ఉద్యోగాల్లో ఉండగా, యువకుల్లో ఇది 55గా ఉంది. ఇవి కేవలం సంఖ్యలు కావు; సామర్థ్యం ఉన్న ఎంతోమంది యువతులు ఉద్యోగానికి, కుటుంబానికి మధ్య ఎంపిక చేసుకోవాల్సి రావడానికి కారణాన్ని ఇవి వివరిస్తాయి. వాస్తవానికి ఎవరూ అలాంటి ఎంపిక చేసుకోవాల్సిన అవసరమే ఉండకూడదు.

పాత ఆందోళనలపై ఇప్పుడు కొత్త భయం కూడా చేరింది. వాతావరణ మార్పు తమ జీవితాలను దెబ్బతీస్తోందని దాదాపు యువత అంతా చెబుతుండగా, తమ మనశ్శాంతిని అది ప్రభావితం చేస్తోందని సగంమంది అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, ఆర్థిక అభద్రత, పర్యావరణ ముప్పు గురించి ఏకకాలంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన యువ భారతీయుల నిష్పత్తి, ప్రపంచంలోనే అత్యధిక స్థాయిల్లో ఒకటిగా ఉంది. అధిక యువత నిరుద్యోగం, అనేక భారతీయ కుటుంబాల్లో ఇప్పుడిప్పుడే మొదలవుతున్న మానసిక ఆరోగ్య చర్చను కూడా కలిపి చూస్తే, పూర్తి చిత్రం స్పష్టమవుతుంది. ఇది తల్లిదండ్రులు కావడాన్ని తిరస్కరిస్తున్న తరం కాదు, తాము నిర్మించుకోబోయే పునాది స్థిరంగా ఉందా? అని సహేతుకంగా ప్రశ్నిస్తున్న తరం. రాష్ట్రాల మధ్య అసమానతలు కూడా భారత్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. బిహార్ సంతానోత్పత్తి రేటు 2.7గా ఉండగా, సిక్కిం రేటు కేవలం 1.0. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటివి ఎప్పుడో భర్తీస్థాయి కంటే దిగువకు చేరుకోగా, బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌వంటి రాష్ట్రాలు ఇంకా ఆ దశకు చేరుకుంటున్నాయి. ఈ వ్యత్యాసాలు, భారత జనసంఖ్యా పరివర్తన వేర్వేరు వేగాలతో సాగుతోందని, ఒకే జాతీయ విధానం అన్ని రాష్ట్రాల వాస్తవికతలను పరిష్కరించలేదని స్పష్టం చేస్తున్నాయి. యువత ఆకాంక్షలకు ప్రతిస్పందించే క్రమంలో, నాణ్యమైన, సరసమైన, అందుబాటులో ఉండే శిశు సంరక్షణ కేంద్రాలు, సంరక్షణ బాధ్యతలను సమానంగా పంచుకునే కుటుంబాలు, స్థిరమైన గౌరవప్రదమైన ఉపాధిలో నిరంతర పెట్టుబడి, వాతావరణ ఆందోళనతో సహా యువత మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ అవసరం. తల్లిదండ్రుల సెలవులు, అనువైన పని వేళలు, కుటుంబ అనుకూల కార్యాలయ వాతావరణం కల్పించడం ద్వారా ప్రైవేటు రంగం కూడా కీలక పాత్ర పోషించగలదు. జనాభా గణాంకాలను సేకరించడంలో, విధాన నిర్ణయాలకు ఆధారంగా వాటిని ఉపయోగించడంలో ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో యూఎన్‌ఎఫ్‌పీఏకు ప్రత్యేక పాత్ర ఉంది. 15నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న 25.5 కోట్ల మంది యువతతో భారత్, ఏ దేశమూ ఇంతవరకూ చూడని అతిపెద్ద తరాన్ని కలిగి ఉంది. ఇదే భారత జనాభా వరం, ఎప్పటికీ తెరిచే ఉండని ఒక అవకాశపు కిటికీ. ఈ తరం తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోగలదా? లేదా? అన్నది, ఆ కిటికీ మూసుకుపోకముందే మనం తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది. యువ భారతీయులు కుటుంబ భావన నుంచి దూరం జరగడం లేదు –దానికి పూర్తిగా అవును అని చెప్పగలిగే పరిస్థితుల కోసం వేచి చూస్తున్నారు! ■

---



వయసు పెరిగే కొద్దీ శరీరం మారుతుంది, కానీ నెపమంతా వయసుపైనే వేయడం సరికాదు. హార్మోన్లనూ, మెటబాలిజాన్నీ నిందించే ముందు, మనం ఎంత కదులుతున్నామో, ఏం తింటున్నామో ఒకసారి ఆలోచించాలి. కదలిక తగ్గినప్పుడు శరీరం బద్ధకిస్తుంది, ప్రొటీన్ లోపించినప్పుడు కండరం కరిగిపోతుంది. నిజమైన మార్పు రావాలంటే వయసును నిందించడం మాని, జీవనశైలిని సరిదిద్దుకోవాలి. ఒంట్లో వచ్చే ప్రతి మార్పుకూ కారణం బయట వెతకనవసరం లేదు, కొన్నిసార్లు అది మన అలవాట్లలోనే దాగి ఉంటుంది. చిన్న క్రమశిక్షణే పెద్ద ఫలితాన్నిస్తుంది.

–మహాదేవ

---

## వింతల్లో వింతలు

# వామ్మో! మనుషుల కోసం ఫ్రిజ్



జపాన్‌లో వేసవి వేడిమి ప్రాణాంతకంగా మారుతోంది. జులై 15న ఒక్కరోజే టోక్యోలో 48మంది వడదెబ్బతో ఆసుపత్రుల పాలయ్యారు. దీంతో ఎస్‌డీఆర్‌ఎస్ అనే రిఫ్రిజిరేషన్ కంపెనీ 'డో హియెమోన్ బాక్స్' పేరుతో వినూత్న పరికరాన్ని రూపొందించింది. దీన్ని నెటిజన్లు 'మనుషుల ఫ్రిజ్'గా పిలుస్తున్నారు. గాజు తలుపుతో కూడిన ఈ మెటల్ బాక్స్‌లో కూర్చుంటే, తల, మెడ, భుజాలపై 5 డిగ్రీల చల్లని గాలి వీస్తుంది. లోపల 15 డిగ్రీల ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. పది నిమిషాలు కూర్చుంటే శరీర ఉష్ణోగ్రత తగ్గి, అలసట తగ్గుతుందని కంపెనీ చెబుతోంది. 20 నిమిషాల్లో ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. దీని ధర 9,200 డాలర్లు (సుమారు రూ.7.7 లక్షలు). ప్రస్తుతం కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాల కోసం మాత్రమే అందుబాటులో ఉంది.

# డీహైడ్రేషన్ బారిన పడితే కేవలం నీళ్లను తాగితే సరిపోదు

సాధారణంగా చాలా మంది ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లో డీహైడ్రేషన్ (శరీరంలో నీటి లోపం) కూడా ఒకటి. ఇది కేవలం ఎండాకాలం లేదా కఠినమైన వ్యాయామం చేసే వాళ్లకే వచ్చే సమస్య కాదు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న అలవాట్ల వల్ల చాలా మంది తెలియకుండానే దీర్ఘకాలిక డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు, వృద్ధులు వంటి వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. నీరు తాగడం మర్చిపోవడం, టీ–కాఫీలపై ఎక్కువగా ఆధారపడడం, దాహం వేయకపోతే నీరు అవసరం లేదనుకోవడం వంటి అలవాట్లు శరీరంపై నెమ్మదిగా ప్రభావం చూపిస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం దాహం వేయడం అనేది శరీరంలో నీటి లోపానికి ముందస్తు సంకేతం కాదు. దాహం అనిపించే సమయానికి శరీరం అప్పటికే స్వల్ప స్థాయిలో డీహైడ్రేషన్‌కు గురై ఉంటుందని వారు చెబుతున్నారు.



## లక్షణాలు ఇవే..

ముఖ్యంగా వృద్ధుల్లో దాహం గుర్తించే శక్తి తగ్గిపోవడంతో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోంది. రోజంతా ఏసీ గదుల్లో కూర్చుని పని చేసే వారికీ కూడా శరీరం శ్వాస, చెమట, మూత్రం ద్వారా నిరంతరం ద్రవాలను కోల్పోతూనే ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల శరీరంపై అనేక రకాల ప్రభావాలు కనిపిస్తాయి. సరిపడా నిద్రపోయినా అలసటగా అనిపించడం, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి మందగించడం, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే కండరాల పట్టుకుపోవడం, జీర్ణక్రియ మందగించడం, మలబద్ధకం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొందరిలో చిరాకు, ఆందోళన వంటి మానసిక మార్పులు కూడా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మధుమేహంతో బాధపడేవారిలో డీహైడ్రేషన్ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు మూత్రం ఎక్కువగా వస్తుంది. దీంతో శరీరం మరింత నీటిని కోల్పోతుంది. డీహైడ్రేషన్ పెరిగితే రక్తంలో గ్లూకోజ్ మరింత సాంద్రత చెందుతుంది. ఇలా ఇది ఒక ప్రమాదకర చక్రంలా మారుతుంది.


## ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరమే..

వృద్ధుల్లో అయితే మూత్రపిండాల పనితీరు తగ్గిపోవడం వల్ల యూరినరీ ఇన్ఫెక్షన్లు, తక్కువ రక్తపోటు, తూలి పడిపోవడం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అయితే ఎక్కువ నీరు తాగితే సరిపోతుందనే భావన పూర్తిగా సరైనది కాదని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి నీటితోపాటు ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరం. సోడియం, పొటాషియం, మెగ్నీషియం, క్లోరైడ్ వంటి ఖనిజాలనే ఎలక్ట్రోలైట్స్ అంటారు. ఇవి శరీర కణాల్లో నీటి సమతుల్యతను కాపాడటంలో, నరాల పనితీరులో, కండరాల కదలికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. చెమట ద్వారా శరీరం నీటితో పాటు ఈ ఖనిజాలను కూడా కోల్పోతుంది. కేవలం నీరు తాగడం వల్ల ద్రవాలు చేరినా, ఎలక్ట్రోలైట్ సమతుల్యత మాత్రం పునరుద్ధరించబడదు.

## సంప్రదాయ పానీయాలను తాగాలి..

సంప్రదాయ పానీయాలు అయిన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి వాటిలో సహజంగానే కొన్ని ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే ప్రతి సందర్భంలో ఇవి సరిపోవని వైద్యులు సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు సరైన ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఎంపికలో కూడా జాగ్రత్త అవసరం. అధిక చక్కెర కలిగిన పానీయాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచి సమస్యలను మరింత పెంచుతాయి. కాబట్టి తక్కువ చక్కెరతో, సరిపడా సోడియం, పొటాషియం కలిగిన పానీయాలను మాత్రమే ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు వైద్యుల సలహాతోనే ఇలాంటి డ్రింక్స్ తీసుకోవడం మంచిది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో హైడ్రేషన్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం అలసటగా అనిపించడం, తరచూ తలనొప్పి రావడం, మెదడు చురుకుదనం తగ్గిపోవడం వంటి సమస్యలు ఉంటే ముందుగా శరీరంలో నీటి లోపం ఉందేమో పరిశీలించుకోవాలి. సరైన సమయంలో తగినంత నీరు, అవసరమైన ఎలక్ట్రోలైట్స్ తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను సులభంగా నివారించవచ్చని పేర్కొంటున్నారు.

# రోజూ మీరు చేసే ఈ చిన్న తప్పులే పేగుల ఆరోగ్యాన్ని క్షీణించేలా చేస్తాయి



ఇప్పటి జీవనశైలిలో గట్ హెల్త్ లేదా జీర్ణాశయ ఆరోగ్యం గురించి అవగాహన వేగంగా పెరుగుతోంది. ఎందుకంటే పేగుల ఆరోగ్యం కేవలం జీర్ణక్రియకే పరిమితం కాదు. శరీర రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, శక్తి స్థాయిలు, చర్మ ఆరోగ్యం వంటి అనేక అంశాలపై ఇది ప్రభావం చూపుతుంది. అయితే సోషల్ మీడియాలో కనిపించే ప్రతి గట్ ఫ్రెండ్లీ సలహా నిజంగా ఉపయోగకరమై ఉండకపోవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, చాలా మంది ప్రతిరోజూ పాటించే కొన్ని సాధారణ అలవాట్లు పేగుల ఆరోగ్యాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తాయని చెబుతున్నారు. చాలా మందికి ఇవి తెలియకుండానే అలవాట్లుగా మారిపోయాయని పేర్కొంటున్నారు. పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే రోజువారీ అలవాట్ల గురించి వారు వివరిస్తున్నారు.

## మరీ అధికంగా ఫైబర్ వద్దు..

చాలామంది ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఒక్కసారిగా అధిక ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ప్రారంభిస్తారు. కానీ ఇలా అకస్మాత్తుగా ఫైబర్ పరిమాణం పెంచితే పొట్ట ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. క్రమంగా ఫైబర్ పరిమాణాన్ని పెంచడం ఉత్తమమని చెబుతున్నారు. అలాగే బరువు పెరుగుతామనే భయంతో కొందరు అన్ని రకాల ఫ్యాట్స్‌ను ఆహారంలో నుంచి పూర్తిగా తొలగిస్తారు. అయితే ఆరోగ్యకరమైన కొవ్వులు పేగుల పొరను బలంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గింజలు, అవకాడో, నెయ్యి వంటి మంచి కొవ్వులను పరిమితంగా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

## ఒకే రకం ఆహారం రోజూ వద్దు..

అదే విధంగా రోజూ ఒకేరకం ఆహారాన్ని పదే పదే తినడం కూడా గట్ హెల్త్‌కు మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా వైవిధ్యమైన ఆహారంతోనే సమతుల్యంగా పెరుగుతాయి. అందుకే కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పులు వంటి విభిన్న ఆహారాలను తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. అంతేకాకుండా భోజనాన్ని కార్బోహైడ్రేట్స్‌తో ప్రారంభించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముందు ఫైబర్ లేదా ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుని, తర్వాత కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం జీర్ణక్రియకు మంచిదని సూచిస్తున్నారు.

## ప్రోటీన్ బార్స్, షేక్స్‌ను పక్కన పెట్టండి..

ఇక సౌకర్యవంతంగా ఉంటాయని భావించి చాలామంది ప్రోటీన్ బార్లు, షేక్స్‌ను తరచూ తీసుకుంటున్నారు. కానీ వీటిలో చాలా వరకు అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇవి గట్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా ప్రతిరోజూ భోజనం చేసే సమయాలు మారుతూ ఉంటే జీర్ణవ్యవస్థ గందరగోళానికి గురవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పేగులు ఒక నిర్దిష్ట సమయానికి అలవాటు పడతాయి కాబట్టి, సమయపాలన చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. అదే విధంగా తిన్న వెంటనే పడుకోవడం కూడా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. భోజనం తర్వాత కొంతసేపు నిటారుగా కూర్చోవడం లేదా నడవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది ఆహారం సులభంగా జీర్ణమవడంలో సహాయపడుతుంది. ఈ విధంగా ఈ సూచనలు గట్ హెల్త్ కోసం కఠినమైన డైట్స్ అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. ప్రతిరోజూ చిన్నచిన్న ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

# కేవలం 7 రోజుల పాటు ధ్యానం చేస్తే ఎన్నో ఉపయోగాలు

మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందని ఎన్నో అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయి. ఇప్పుడు తాజాగా వెలుగులోకి వచ్చిన మరో పరిశోధన డీప్ మెడిటేషన్‌పై మరిన్ని ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టింది. కేవలం ఏడు రోజుల పాటు లోతైన ధ్యానం చేస్తే మెదడు పనితీరులో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని ఈ అధ్యయనం చెబుతోంది. ముఖ్యంగా మెదడు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడటంతోపాటు రక్త సంబంధిత జీవక్రియలపై కూడా దీని ప్రభావం ఉంటుందని పరిశోధకులు వెల్లడించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాండియాగో నిర్వహించిన ఈ అధ్యయనం ప్రకారం, ధ్యానం, మైండ్–బాడీ టెక్నిక్స్ కలిపి చేసిన ఏడు రోజుల ప్రత్యేక కార్యక్రమం మెదడు కార్యకలాపాలు, శరీర జీవక్రియలలో కొలిచే స్థాయిలో మార్పులు తీసుకువచ్చిందని గుర్తించారు. ఈ ఫలితాలను కమ్యూనికేషన్స్ బయాలజీ జర్నల్‌లో ప్రచురించారు.



## రోగ నిరోధక వ్యవస్థ చురుగ్గా..

పరిశోధనలో పాల్గొన్న వారిలో మెదడు నాడీ వ్యవస్థలో కొత్త మార్పులు కనిపించాయని, దీని ద్వారా న్యూరోప్లాస్టిసిటీ సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంటే మెదడు కొత్త అనుభవాలకు అనుగుణంగా తన పనితీరును మార్చుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ అధ్యయనంలో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, ధ్యానం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ కూడా చురుకుగా మారిందని గుర్తించారు. అలాగే సహజసిద్ధమైన నొప్పి నివారణ రసాయనాల ఉత్పత్తి కూడా పెరిగినట్లు వెల్లడించారు. దీని వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉండే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ధ్యానం కేవలం ఒత్తిడి తగ్గించే ప్రక్రియ మాత్రమే కాదని, అది మెదడు వాస్తవాలను గ్రహించే విధానాన్నే మార్చగలదని పరిశోధకులు తెలిపారు. ఈ మార్పులను మెదడు, రక్త పరీక్షల ద్వారా నేరుగా కొలిచామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## వేగంగా పెరుగుతున్న మానసిక సమస్యలు..

ఏడు రోజుల ధ్యాన శిబిరంలో మొత్తం 33 గంటల గైడెడ్ మెడిటేషన్ నిర్వహించారు. ఇందులో గ్రూప్ హీలింగ్ యాక్టివిటీస్, మానసిక ఆరోగ్య పద్ధతులు కూడా భాగంగా ఉండటం వల్ల పాల్గొన్న వారిలో మంచి ఫలితాలు కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. దేశంలో యోగా, ధ్యానంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ అధ్యయనం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీర్ఘకాలిక నొప్పులు, మూడ్ డిజార్డర్లు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు దేశంలో వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో దీర్ఘకాలిక నొప్పుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిత్య జీవితంలో ధ్యానాన్ని భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు మెదడు పనితీరు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా డీప్ మెడిటేషన్ చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు.

# తరచూ అసిడిటీ లేదా ఈ జీర్ణ సమస్యలు వస్తున్నాయా.. అయితే జాగ్రత్త..

ప్రస్తుతం ఉన్న వేగవంతమైన జీవనశైలిలో అసిడిటీ, గ్యాస్, పొట్టలో మంట వంటి సమస్యలు చాలా సాధారణంగా మారిపోయాయి. అసమయ భోజనం, అధిక కాఫీ, టీలు, మసాలా ఆహారం, రాత్రివేళల్లో ఆలస్యంగా తినడం వంటి అలవాట్ల వల్ల చాలామందిలో ఈ సమస్యలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇవి తాత్కాలికంగా ఉండి, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే తగ్గిపోతాయి. అయితే అసిడిటీ తరచూ రావడం, రోజురోజుకూ తీవ్రంగా మారడం లేదా ఎక్కువకాలం కొనసాగడం వంటి పరిస్థితులను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య నిపుణుల ప్రకారం, వారానికి రెండు నుంచి మూడు సార్లకంటే ఎక్కువ అసిడిటీ రావడం సాధారణ విషయం కాదని చెబుతున్నారు.



## వాంతులు, వికారం..

ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్ర భంగం కలిగించే రిఫ్లక్స్, మింగడానికి ఇబ్బంది, తరచూ వాంతులు, కారణం లేకుండా బరువు తగ్గడం, వాంతుల్లో లేదా మలంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇవి సాధారణ గ్యాస్ సమస్యకంటే తీవ్రమైన జీర్ణాశయ వ్యాధులకు సంకేతాలు కావచ్చని పేర్కొంటున్నారు. తరచూ అసిడిటీ రావడానికి పలు కారణాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్డీ), కడుపులో అల్సర్లు, ఫంక్షనల్ డిస్పెప్సియా వంటి సమస్యలు దీనికి కారణమవుతాయి. కొన్నిసార్లు ప్రారంభ దశలో ఉన్న జీర్ణాశయ క్యాన్సర్లలో కూడా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే లక్షణాలను తేలికగా తీసుకోకుండా సరైన పరీక్షలు చేయించుకోవడం అవసరమని చెబుతున్నారు.

## సమస్యలు వచ్చే అవకాశం..

అసిడిటీని ఎక్కువకాలం నిర్లక్ష్యం చేస్తే పలు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆహార నాళంలో మంట, గాయాలు ఏర్పడటం, మింగడానికి ఇబ్బంది కలగడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే బారెట్ ఈసోఫేగస్ అనే పరిస్థితి కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇది భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

## ఇవి కూడా కారణాలే..

అయితే ప్రతి అసిడిటీ సమస్య వెనుక శారీరక వ్యాధులే ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు కూడా జీర్ణక్రియపై ప్రభావం చూపుతాయి. దీని వల్ల పొట్ట ఉబ్బరం, భోజనం చేసిన వెంటనే నిండిన భావన, పై పొట్టలో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో పెద్ద సమస్య కనిపించకపోయినా, ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. 40 ఏళ్లు దాటిన తర్వాత కొత్తగా అసిడిటీ సమస్య ప్రారంభమైతే మరింత జాగ్రత్త అవసరమని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం చేసే వారు, కుటుంబంలో జీర్ణాశయ క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, చాలా కాలంగా రిఫ్లక్స్‌తో బాధపడుతున్నవారు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైతే ఎండోస్కోపీ వంటి పరీక్షలు చేయడం ద్వారా సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని పేర్కొంటున్నారు.

## జీవనశైలిలో మార్పులు అవసరం..

అసిడిటీని నియంత్రించేందుకు జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం చాలా అవసరం. సమయానికి భోజనం చేయడం, మసాలా, వేయించిన ఆహారాన్ని తగ్గించడం, తిన్న వెంటనే పడుకోకుండా ఉండడం, బరువును నియంత్రణలో ఉంచడం, నిద్రపోయేటప్పుడు తల భాగాన్ని కొద్దిగా ఎత్తుగా ఉంచడం వంటి అలవాట్లు ఉపశమనానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే యోగా, ధ్యానం వంటి ఒత్తిడి తగ్గించే పద్ధతులు కూడా ఉపయోగపడతాయని సూచిస్తున్నారు. అసిడిటీ సాధారణ సమస్యగానే కనిపించినా, తరచూ రావడం లేదా తీవ్రమవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరైన సమయంలో వైద్య సలహా తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని పేర్కొంటున్నారు.

## భారత జట్టులో భారీ మార్పులు.. ఏడుగురు ఔట్, ఆరుగురు కొత్తవారికి ఛాన్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన తర్వాత రేపటి నుంచి టీమిండియా క్రికెట్ జట్టు మరో విదేశీ పర్యటనకు సిద్ధమైంది. జింబాబ్వేతో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇండియా తలపడనుంది. ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు జూలై 23 నుంచి జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలోనే జరగనున్నాయి. కెప్టెన్‌గా టీ20ల్లో తొలి విజయం కోసం వేచి చూస్తున్న శ్రేయస్ అయ్యర్ భారత జట్టుని ముందుకు నడిపించనున్నాడు. ఈ జట్టులో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ లాంటి ప్లేయర్స్ కి ఛాన్స్ దక్కింది. 2026లో ఆడుతున్న మూడో విదేశీ టీ20 సిరీస్ కోసం సెలెక్టర్లు జట్టులో భారీ మార్పులు చేశారు.

**జట్టులోకి వచ్చిన ఆటగాళ్లు:**

రింకూ సింగ్, మయాంక్ యాదవ్: జింబాబ్వే జరగబోయే టీ20 సిరీస్ కోసం భారత జట్టు ప్రకటించిన జాబితాలో స్టార్ ఆటగాడు రింకూ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అలాగే గాయాలతో చాన్నాళ్లుగా టీమ్ కి దూరమైన పేసర్ మయాంక్ యాదవ్ రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు.

అరంగేట్రం చేయబోతున్న కొత్తవారు: ఇప్పటి వరకు జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేయని యువ బౌలర్లు అశోక్ శర్మ, యష్ ఠాకూర్ ఈ సిరీస్ కోసం తొలిసారి బీసీసీఐ నుంచి పిలుపువచ్చింది.

హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్: వన్డేలు ఆడిన విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబేకి కూడా తొలిసారి టీ20ల్లో ఆడేందుకు కాల్ వచ్చింది. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున అత్యధిక రన్స్ చేసిన వికెట్ కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**జట్టుకు దూరమైన ప్లేయర్స్:**

సంజూ శాంసన్ పై వేటు: ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను సెలెక్టర్లు ఈ సిరీస్ కి పక్కనబెట్టారు. ఈ నిర్ణయంపై అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీపై ఫ్యాన్స్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

పేసర్లు, ఆల్‌రౌండర్లు: అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాలతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు ఈ సిరీస్‌లో రెస్ట్ ఇచ్చారు.

వరుణ్ చక్రవర్తి గాయం: తొలుత బీసీసీఐ ప్రకటించిన జట్టులో ఉన్న స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో గాయపడటంతో ఈ సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతని స్థానంలో రవి బిష్ణోయ్‌ను మళ్లీ తుది జట్టులోకి తీసుకున్నారు.

**జట్టులో స్థానం పదిలం చేసుకున్న ఆటగాళ్లు వీళ్లే:**

ఇంగ్లాండ్ సిరీస్ ఆడిన జట్టు నుంచి శ్రేయస్ అయ్యర్, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ తమ స్థానాలను ఫిక్స్ చేసుకున్నారు.

**జింబాబ్వేతో టి20 సిరీస్‌కి భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## భారత్ vs జింబాబ్వే టీ20 రికార్డ్స్.. అత్యధిక పరుగులు, వికెట్లు, సిక్సర్లు ఎవరివంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 (ట20×) సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ రేపు (గురువారం, జూలై 23న) హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరుగుతుంది. అదే మైదానంలో శనివారం (జూలై 25న) రెండవ టీ20, ఆదివారం (జూలై 26న) మూడవ టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ హోమ్ సిరీస్ కోసం జింబాబ్వే ఈరోజు (బుధవారం) తమ జట్టును ప్రకటించింది. స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజాను జట్టులో కొనసాగించింది. జింబాబ్వే తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రజా, బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించి సొంత ఫ్యాన్స్ ముందు భారత్‌ను ఓడించి సిరీస్ గెలవాలని చూస్తున్నాడు.

**తొలి విజయం కోసం శ్రేయస్ వెయిటింగ్:**

భారత టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవాలని శ్రేయస్ అయ్యర్ పట్టుదలతో ఉన్నాడు. అతను ఇప్పటి వరకు భారత్‌కు 8 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా, అందులో 7 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదురైంది. సెలెక్టర్లు ఈ పర్యటనకు బలమైన బ్యాటింగ్ రంగాన్ని ఎంపిక చేయగా, బౌలింగ్‌లో కొందరు ఇంకా అరంగేట్రం చేయని (అన్‌క్యాప్‌డ్) బౌలర్లు ఉన్నారు. భారత్ చివరిసారిగా ఫిబ్రవరి 2026లో జరిగిన టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో జింబాబ్వేతో ఆడింది. అంతకుముందు జూలై 2024లో జింబాబ్వేలో పర్యటించిన భారత్, శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన 5 టీ20ల సిరీస్‌లో 4 మ్యాచ్‌లను గెలుచుకుంది.

**భారత్ – జింబాబ్వే టి20 మ్యాచ్‌ల రికార్డులు:**

అత్యధిక విజయాలు: భారత్ - 14 మ్యాచ్‌ల్లో 11 విజయాలు.

అత్యధిక స్కోరు: భారత్ - 256/4 (20 ఓవర్లలో), చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో (ఫిబ్రవరి 26, 2026).

అత్యల్ప స్కోరు: జింబాబ్వే- 99/9 (20 ఓవర్లలో), హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో (జూన్ 20, 2016).

రన్స్ పరంగా పెద్ద విజయం: భారత్ 100 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 235) – హరారేలో (జూలై 7, 2024).

వికెట్ల పరంగా పెద్ద విజయం: భారత్ 10 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 153) – హరారేలో (జూలై 13, 2024).

పరుగుల పరంగా చిన్న విజయం: జింబాబ్వే 2 పరుగుల తేడాతో విజయం (లక్ష్యం: 171) హరారేలో (జూన్ 18, 2016).

వికెట్ల పరంగా చిన్న విజయం: భారత్ 6 వికెట్ల తేడాతో విజయం (లక్ష్యం: 112) – హరారేలో (జూన్ 12, 2010).

**ఆటగాళ్ల రికార్డులు:**

అత్యధిక పరుగులు: సికందర్ రజా (జింబాబ్వే) –11 మ్యాచ్‌ల్లో 194 రన్స్.

అత్యధిక వ్యక్తిగత స్కోరు: అభిషేక్ శర్మ (భారత్) - 47 బంతుల్లో 100 పరుగులు, హరారేలో (జూలై 7, 2024).

అత్యుత్తమ సగటు (కనీసం 5 ఇన్నింగ్స్‌లు): శుభ్‌మన్ గిల్ (భారత్) - 42.50 (5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు).

అత్యుత్తమ స్ట్రైక్ రేట్ (కనీసం 50 బంతులు): అభిషేక్ శర్మ (భారత్) - 177.22 (6 మ్యాచ్‌ల్లో 179 పరుగులు).

అత్యధిక సెంచరీలు: అభిషేక్ శర్మ (భారత్) - 1.

అత్యధిక హాఫ్ సెంచరీలు: శుభ్‌మన్ గిల్ (భారత్) - 2.

అత్యధిక డకౌట్లు: మనీష్ పాండే (భారత్), వెస్లీ మాధెవెరె (జింబాబ్వే) – తలో 2 సార్లు.

అత్యధిక సిక్సర్లు: అభిషేక్ శర్మ (భారత్) – 6 మ్యాచ్‌ల్లో 13 సిక్సర్లు.

ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు: శుభ్‌మన్ గిల్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 5 మ్యాచ్‌ల్లో 170 పరుగులు.

అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ (భారత్), సికందర్ రజా, బ్లెస్సింగ్ ముజరబానీ (జింబాబ్వే) – తలో 8 వికెట్లు.

అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు: బరీందర్ శరణ్ (భారత్) - 4/10 (4 ఓవర్లలో), హరారేలో (జూన్ 20, 2016).

ఒకే సిరీస్‌లో అత్యధిక వికెట్లు: ముకేష్ కుమార్ (భారత్) – జూలై 2024 పర్యటనలో 3 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు.

అత్యధిక డిస్మిసల్స్: సంజూ శాంసన్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 3 డిస్మిసల్స్ (3 క్యాచ్‌లు).

అత్యధిక క్యాచ్‌లు: రింకూ సింగ్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 6 క్యాచ్‌లు.

అత్యుత్తమ భాగస్వామ్యం: శుభ్‌మన్ గిల్ అండ్ యశస్వి జైస్వాల్ (భారత్) – మొదటి వికెట్‌కు 156 రన్స్ (జూలై 13, 2024).

అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 11 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు: సికందర్ రజా (జింబాబ్వే) – 7 మ్యాచ్‌లు.

లి కెప్టెన్‌గా అత్యధిక విజయాలు: శుభ్‌మన్ గిల్ (భారత్) – 5 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.

## విప్లవ పథం: నక్సలైట్ పాత్రల్లో మెప్పించిన టాప్-5 కథానాయికలు

తెలుగు చిత్రసీమలో నాయిక ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తుపాకీ చేతబట్టి విప్లవ పోరాటాలు చేసే నక్సలైట్ పాత్రల్లో నటించి మెప్పించడం ప్రతి నటికి ఒక గొప్ప సవాలు. విప్లవ భావజాలాన్ని, భావోద్వేగాలను పండించి నక్సల్స్ పాత్రల్లో






అలరించిన కథానాయికల వైపు దర్శకులు, ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తి చూపుతూనే ఉన్నారు. ఈ తరహా పాత్రల్లో మెప్పించిన మేటి నటిగా లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలో ఈ సీనియర్ నటి పోషించిన రాములమ్మ పాత్ర తెలుగు సినిమా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా అడవి బాట పట్టి నక్సలైట్‌గా మారిన పాత్రలో విజయశాంతి చూపించిన రౌద్రం.. పవర్‌ఫుల్ నటన ప్రేక్షకులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే సహజనటి జయసుధ కూడా గతంలో 'మహా సంగ్రామం' వంటి చిత్రాలలో నక్సలైట్ తరహా పాత్రను అత్యంత హుందాతనంతో భావోద్వేగాలను పండించి తన నటనా ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక ప్రస్తుత తరం హీరోయిన్లలో సాయి పల్లవి 'విరాటపర్వం' సినిమాలో 'వెన్నెల'గా నక్సలైట్ కథాంశంలో జీవించారు. కామ్రేడ్ రవన్న భావజాలానికి ఆకర్షితురాలై... ప్రేమ కోసం అడవి బాట పట్టిన అమాయకపు పల్లెటూరి అమ్మాయిగా సాయి పల్లవి కనబరిచిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే విడుదలైన 'మాఇంటి బంగారం' చిత్రంలో సమంత కూడా నక్సలైట్ నేపథ్య డైనమిక్ పాత్రలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. అలాగే రష్మిక మందన్న 'మైసా' చిత్రంలో కట్టుబొట్టు మార్చి రౌద్ర రూపంతో కూడిన విప్లవాత్మక పాత్రను పోషించడం ఈ ట్రెండ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.

కేవలం అగ్ర కథానాయికలే కాకుండా.. టాలీవుడ్‌లో వచ్చిన పలు పరిమిత బడ్జెట్.. కంటెంట్ బేస్డ్ సినిమాల్లో కూడా నటీమణులు నక్సలైట్ పాత్రల్లో అద్భుతంగా రాణించారు. అప్పట్లో ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'ఎర్రసైన్యం', 'ఎన్‌కౌంటర్' వంటి చిత్రాల్లో విప్లవ నాయకిలుగా నటించిన నటీమణులు పల్లెటూరి ప్రజల ఆక్రందనలకు చలించి విప్లవ పోరాటాల బాట పట్టే ప్రజా యోధులుగా నటించారు. అటు బాలీవుడ్‌లో 'హజారోన్ ఖ్వాయిషేన్ ఐసీ' చిత్రంలో చిత్రంగద సింగ్... కోలీవుడ్‌లో ప్రకాష్ రాజ్ దర్శకత్వం వహించిన 'కంజీవరమ్' లో.. పలు తమిళ రాజకీయ-విప్లవ సినిమాల్లో సౌత్ కథానాయికలు నక్సల్స్ గానో.. తిరుగుబాటుదారుల పాత్రల్లోనో నటించి మెప్పించారు.ప్రజా యుద్ధనౌక, విప్లవ చిత్రాల పితామహుడు ఆర్. నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఎర్రసైన్యం చిత్రంలో యాంకర్ ఉదయభాను నక్సలైట్ గా అద్భుతంగా నటించి మెప్పించారు. ఆయన తెరకెక్కించిన చీమలదండు, దళం, ఒకే ఒక్కడు, లాల్ సలామ్ వంటి చిత్రాలలో నక్సలైట్లుగా .. విప్లవ పోరాట నాయికలుగా నటీమణులు అత్యంత సహజమైన అభినయంతో మెప్పించారు. రొటీన్ కమర్షియల్ హంగులకు




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965